RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు 8
సంపుటి: 4 సంచిక:81 | మార్చి 08, 2026 | వెల: రూ.3-00

## అన్న పెళ్లి ఆపేందుకు తల్లిని చంపేశాడు

- ఖర్చుచేసిన డబ్బు ఇచ్చే స్థోమత లేకే ఘాతుకం
- వృద్ధురాలి హత్య కేసులో వీడిన మిస్టరీ
- వివరాలు వెల్లడించిన పోలీసులు

2లో



## కల్తీ అల్లం పేస్ట్ తయారీ ముఠా గుట్టురట్టు



2లో

## సమాజ గమనాన్ని మార్చే శక్తిగా మహిళా శక్తి

వంటింటిని దాటి..
ప్రపంచ శిఖరాగ్రం తాకి!

- ప్రగతి చక్రం తిప్పుతున్న నారీమణులు
- రంగం ఏదైనా మాకు మేమే సాటి అంటూ..
- మహిళా సాధికారతకు కేరాఫ్ తెలంగాణ
- మహిళా ప్రగతికి ఎన్నెన్నో పథకాలు
- ప్రగతి పథంలో దూసుకుపోతున్నా వెంటాడుతున్న సామాజిక వివక్ష
- ఇంకా ఆగని లైంగిక వేధింపులు.. అత్యాచారాలు, అవమానాలు

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

2లో



# అన్నింటా.. జగమంతా!

వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి

అమ్మగా లాలించి, ఆలిగా తోడు నిలిచి, చెల్లిగా ప్రేమనందిస్తూనే.. నేడు సమాజ గమనాన్ని మార్చే శక్తిగా మహిళా మూర్తి అవతరించింది. ఒకప్పుడు వంటింటి గడపకే పరిమితమైన మహిళ.. నేడు ఆకాశమే హద్దుగా ప్రగతి శిఖరాలను అధిరోహిస్తోంది. పాలనలో కలెక్టర్లుగా, రక్షణలో షీ టీమ్స్‌గా, మైదానంలో క్రీడాకారిణులుగా.. రంగం ఏదైనా మాకు మేమే సాటి అని నిరూపిస్తున్నారు నేటి ధీరవనితలు. ఒకవైపు మహాలక్ష్మి పథకంతో ఆర్థికంగా నిలదొక్కుకుంటున్న మహిళలు, మరోవైపు స్వయం సహాయక సంఘాల ద్వారా పారిశ్రామిక వేత్తలుగా ఎదుగుతున్న వైనం మహిళా శక్తికి నిదర్శనంగా నిలుస్తోంది. అయితే, ప్రగతి పథంలో దూసుకుపోతున్నా.. లైంగిక వేధింపులు సామాజిక వివక్ష, సమాన వేతనం వంటి సవాళ్లు ఇంకా మిగిలే ఉన్నాయి. ఈ నేపథ్యంలో, అబల నుంచి సబలగా మారిన తెలంగాణ మహిళా వికాసంపై, ప్రభుత్వం అందిస్తున్న భరోసాపై నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'వేద న్యూస్' ప్రత్యేక కథనం..



- వరద కాలువలో ప్రవహిస్తున్నవి ప్రాజెక్టు నీళ్లు కావా?
- గాయత్రి పంప్ హౌస్ మోటార్లు నడుస్తున్నాయి
- ప్రాజెక్టుపై తప్పుదారి పట్టించే ప్రచారం చేస్తున్నారు
- మాజీ మంత్రి హరీశ్ రావు

2లో

## కాళేశ్వరంపై సీఎం వ్యాఖ్యలు అబద్ధం



## భారీ సరెండర్

### సీఎం సమక్షంలో 130 మంది మావోయిస్టుల లొంగుబాటు

2లో

- ఆయుధాలతో లొంగిపోయిన మావోయిస్టులు
- హింసకు పరిష్కారం లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం
- లొంగిపోయిన వారికి పునరావాసం, రక్షణ హామీ

వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి

ప్రజా సమస్యలకు ఆయుధాలు, హింస ద్వారా పరిష్కారం దొరకదని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు ఆయుధాలను విడిచిపెట్టి జనజీవన స్రవంతిలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపునకు స్పందిస్తూ హైదరాబాద్‌లోని ఐసీసీసీ కేంద్రంలో నిర్వహించిన

మిగతా 2వ పేజీలో



## బీర్ బాటిల్‌లో చేపపిల్ల

- మూత ఓపెన్ చేసిన కస్టమర్‌కు షాక్
- బాటిల్‌లో ఈదుతూ చేపపిల్ల దర్శనం
- సోషల్ మాధ్యమాల్లో వైరల్ అయిన వీడియో
- మల్లాపూర్‌లో కలకలం

2లో

వేద న్యూస్

ఆదివారం | మార్చి 08, 2026

# భారీ సరెండర్



**మొదటి పేజీ తరువాయి**

ప్రజా సమస్యలకు ఆయుధాలు, హింస ద్వారా పరిష్కారం దొరకదని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు ఆయుధాలను విడిచిపెట్టి జనజీవన స్రవంతిలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపునకు స్పందిస్తూ హైదరాబాద్‌లోని ఐసీసీసీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి సమక్షంలో 130 మంది మావోయిస్టులు పోలీసులకు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక రీజినల్ కమిటీ సభ్యుడు, పది మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 46 మంది ఏరియా కమిటీ సభ్యులు, 70 మంది పార్టీ సభ్యులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వారు తమ వద్ద ఉన్న 124 అత్యాధునిక ఆయుధాలను కూడా పోలీసులకు అప్పగించారు. ఒకేసారి ఇంత పెద్ద సంఖ్యలో ఆయుధాలతో లొంగిపోవడం ఇదే తొలిసారి అని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ పిలుపును నమ్మి ముందుకు వచ్చిన మావోయిస్టులు జనజీవనంలోకి కలవడం శుభపరిణామమన్నారు. లొంగిపోయిన వారి ప్రాణాలకు ఎలాంటి హాని కలగకుండా వారికి రక్షణ కల్పిస్తామని తెలిపారు. సాధారణ జీవితం గడపడానికి అవసరమైన ఆర్థిక సహాయం, ఇతర వసతులను ప్రభుత్వం అందిస్తుందని హామీ ఇచ్చారు. మహాత్మా గాంధీ శాంతియుత పోరాటంతో దేశానికి స్వాతంత్ర్యం సాధించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. ఎంత పెద్ద సమస్య అయినా చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమని ఆయన అన్నారు. ఇటీవల లొంగిపోయిన మావోయిస్టు నాయకులు దేవ్ జీ, దామోదర్, రాజిరెడ్డి, చంద్రన్న తదితరులు తమ పునరావాసానికి సంబంధించిన ప్రతిపాదనలు తనకు తెలియజేశారని తెలిపారు. మావోయిస్టుల లొంగుబాటు, పునరావాసం విషయంలో తెలంగాణ ప్రభుత్వం మానవీయ కోణంలో వ్యవహరిస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 2024 జనవరి నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో మొత్తం 721 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు తెలిపారు. లొంగిపోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లతో పాటు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. అవసరమైతే కేసుల పరిశీలన కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తామని సీఎం వెల్లడించారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు ఆయుధాలు వదిలి లొంగిపోతే వారికి పూర్తి సహకారం అందిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు చెక్కులను ముఖ్యమంత్రి అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, అదనపు డీజీ విజయ్ కుమార్, ఐజీ సుమతి తదితర అధికారులు పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై సీఎం వ్యాఖ్యలు అబద్ధం

## మాజీ మంత్రి హరీశ్ రావు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే చెబుతున్న వ్యాఖ్యలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ఖండించారు. ప్రాజెక్టుపై అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆయన విమర్శించారు. హరీశ్ రావు మాట్లాడుతూ ప్రస్తుతం వరద కాలువలో పారుతున్న నీళ్లు కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వచ్చినవే కాదా అని ప్రశ్నించారు. ప్రాజెక్టు పనిచేయకపోతే ఈ నీరు ఎలా వస్తుందని ఆయన నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని గాయత్రి పంప్ హౌస్ మోటార్లు నడుస్తున్నందువల్లే ఈ నీరు ప్రవహిస్తున్నదని తెలిపారు. ప్రాజెక్టు పనితీరును ప్రజల ముందు తప్పుగా చూపించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్రానికి కీలకమైన సాగునీటి వనరుగా నిలుస్తోందని ఆయన అన్నారు. ప్రాజెక్టుపై రాజకీయ విమర్శలు చేయకుండా వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని హరీశ్ రావు సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు నీరు అందుతోందని ఆయన పేర్కొన్నారు.

# కల్తీ అల్లం పేస్ట్ తయారీ ముఠా గుట్టురట్టు

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

హైదరాబాద్ నగర ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారీ ముఠాను పోలీసులు పట్టుకున్నారు. సికింద్రాబాద్ జోన్ టాస్క్‌ఫోర్స్ మరియు లాల్లాగూడ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన మెరుపు దాడుల్లో ఈ భారీ నెట్‌వర్క్ బయటపడింది. ప్రాణాంతక రసాయనాలతో అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారు చేసి నగరంలోని కిరాణా దుకాణాలకు సరఫరా చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 'ఝాన్సీ అల్లం మరియు వెల్లుల్లి పేస్ట్' పేరుతో గోడౌన్ నిర్వహిస్తున్న నీలా వెంకటేశ్వర్లుతో పాటు మరో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ గోడౌన్‌లో అత్యంత హానికరమైన ఎసిటిక్ యాసిడ్, శాంతన్ గమ్ వంటి రసాయనాలను అల్లం–వెల్లుల్లి మిశ్రమంలో కలిపి పేస్ట్ తయారు చేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ మిశ్రమాన్ని ప్లాస్టిక్ టబ్‌లలో రోజుల తరబడి ఉంచి కుళ్లబెట్టి, అనంతరం ఆకర్షణీయమైన నకిలీ బ్రాండ్ లేబుల్స్ అతికించి మార్కెట్‌లోకి పంపుతున్నట్లు పోలీసులు తెలిపారు. తక్కువ ధరకు అమ్ముతూ నగరంలోని పలుచోట్ల కిరాణా దుకాణాలకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. దాడుల్లో భాగంగా పోలీసులు సుమారు 1,915 కిలోల కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌తో పాటు తయారీకి ఉపయోగిస్తున్న యంత్రాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మార్కెట్‌లో తక్కువ ధరకు లభిస్తుందని నకిలీ బ్రాండ్లను కొనుగోలు చేయవద్దని అధికారులు ప్రజలను హెచ్చరించారు. అపరిశుభ్రమైన వాతావరణంలో తయారయ్యే ఇటువంటి కల్తీ ఆహార పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానం వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని నగర ప్రజలను కోరారు.

# అన్నింటా.. జగమంతా!

- సమాజ గమనాన్ని మార్చే శక్తిగా మహిళా శక్తి
- ప్రగతి చక్రం తిప్పుతున్న నారీమణులు
- రంగం ఏదైనా మాకు మేమే సాటి అంటూ..
- మహిళా సాధికారతకు కేరాఫ్ తెలంగాణ
- మహిళా ప్రగతికి ఎన్నెన్నో పథకాలు
- ప్రగతి పథంలో దూసుకుపోతున్నా వెంటాడుతున్న సామాజిక వివక్ష
- ఇంకా ఆగని లైంగిక వేధింపులు.. అత్యాచారాలు

## నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

**వేద న్యూస్, ప్రత్యేక ప్రతినిధి**



ప్రపంచం గర్వించేలా సత్తా చాటుతున్న మహిళా మూర్తులకు వందనం చేసే సమయం ఆసన్నమైంది. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళ, నేడు ఆకాశమే హద్దుగా దూసుకుపోతోంది. పాలనలో, పారిశ్రామిక రంగంలో, రక్షణ శాఖలో, చివరికి వ్యవసాయంలో కూడా తనదైన ముద్ర వేస్తూ సమాజ గమనాన్ని మారుస్తోంది. స్త్రీ శక్తి లేకుండా సమాజ అభివృద్ధి అసాధ్యం అనే నినాదంతో నేడు ఊరూవాడ మహిళా చైతన్యం వెల్లివిరుస్తోంది.

### రంగం ఏదైనా.. రారాజు మహిళే

నేటి మహిళా ప్రస్థానం కేవలం ఉద్యోగాలకే పరిమితం కాలేదు. పోలీస్ శాఖలో షీ టీమ్స్ ద్వారా భద్రతను పర్యవేక్షించడం నుంచి, కలెక్టర్లుగా జిల్లాలను పాలించడం వరకు అన్నింటా తామే సాటి అని నిరూపిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా, డాక్టర్లుగా, పైలట్లుగా దేశ కీర్తిని పెంచుతున్నారు. ముఖ్యంగా క్రీడా రంగంలో మిథాలీ రాజ్, పీవీ సింధు వంటి వారు చూపిన బాటలో ఎంతో మంది గ్రామీణ క్రీడాకారిణులు నేడు జాతీయ స్థాయి పతకాలను కైవసం చేసుకుంటున్నారు. మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మహిళా విశ్వవిద్యాలయాలు వారి ఉన్నత విద్యకు బాటలు వేస్తున్నాయి.

### మహిళల భద్రతకు భరోసా..

మహిళల భద్రత విషయంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాలు, షీ టీమ్స్ మహిళలకు రక్షణ కవచంలా మారాయి. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లపై చర్చ జరుగుతున్న వేళ, స్థానిక సంస్థల్లో మహిళలకు ప్రాధాన్యత పెరగడం వల్ల రాజకీయంగా కూడా వారు బలపడుతున్నారు. ఆత్మగౌరవ భవనాల నిర్మాణం, గర్భిణీ స్త్రీల కోసం, ఆరోగ్య మహిళా కేంద్రాల ద్వారా వైద్య సేవలు అందజేస్తూ మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది.

### మహిళా వికాసం కోసం ప్రభుత్వం

తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా కోట్లాది మంది మహిళలు నేడు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా పేద మహిళల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయి. స్వయం సహాయక సంఘాల ద్వారా కోట్లాది రూపాయల వడ్డీ లేని రుణాలు అందజేస్తూ, మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు ప్రభుత్వం గట్టి పునాదులు వేస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు సైతం నేడు డిజిటల్ విద్యను అభ్యసిస్తూ అంతర్జాతీయ మార్కెట్‌తో పోటీ పడుతుండటం విశేషం.

### సాధించాల్సింది మరెంతో..

అభివృద్ధి జరుగుతున్నప్పటికీ, సమాజంలో ఇంకా మహిళలపై జరుగుతున్న వివక్ష, అఘాయిత్యాలు పూర్తిగా అంతం కాలేదు. సమాన పనికి సమాన వేతనం, సామాజిక భద్రత వంటి అంశాల్లో ఇంకా మార్పు రావాల్సిన అవసరం ఉంది. కేవలం ఒక రోజు వేడుకగా కాకుండా, ప్రతిరోజూ మహిళల హక్కులను గౌరవించే సంస్కృతి అలవర్చుకోవాలి. చదువుకున్న మహిళలు గ్రామీణ మహిళలకు తోడుగా నిలిచినప్పుడే నిజమైన సాధికారత సాధ్యమవుతుందని సామాజికవేత్తలు అభిప్రాయపడుతున్నారు.


# ఐక్యంగా ఉందాం.. కాంగ్రెస్ జెండా ఎగరేద్దాం

- పార్టీలో ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం
- మంత్రి కొండా సురేఖ
- కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి**



వరంగల్ తూర్పు నియోజకవర్గంలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలకు భారీ షాక్ తగిలింది. గ్రేటర్ వరంగల్ 20వ డివిజన్ పరిధిలో బీఆర్ఎస్, బీజేపీ పార్టీలలో సుదీర్ఘకాలంగా కొనసాగిన పలువురు నాయకులు ఆయా పార్టీలకు రాజీనామా చేసి, రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మంత్రి కొండా సురేఖ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. పార్టీలో చేరిన వారందరినీ కాపాడుకునే బాధ్యత తనదేనని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వరంగల్ తూర్పు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందంజలో నిలిపేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో కొత్త, పాత అనే బేధం లేకుండా అందరూ ఐక్యంగా పనిచేసి వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేయాలని మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ డివిజన్లకు చెందిన కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



# అన్న పెళ్లి ఆపేందుకు తల్లిని చంపేశాడు..

- ఖర్చుచేసిన డబ్బు ఇచ్చే స్థోమత లేకే ఘాతుకం
- వృద్ధురాలి హత్య కేసులో వీడిన మిస్టరీ
- వివరాలు వెల్లడించిన పోలీసులు



**వేద న్యూస్, రామడుగు**

మూడు రోజుల క్రితం మండల కేంద్రంలో హత్యకు గురైన ఈరెళ్ళ గౌరమ్మ మృతి కేసులో పోలీసులు చిక్కు ముడి విప్పారు. హంతకుడు మృతురాలి చిన్న కుమారుడు ఈరెళ్ల అనిల్ అని అదే రోజు అతనిపై అనుమానం ఉందని అన్న మహేష్ ఇచ్చిన పిర్యాదు ఆధారంగా అనిల్ ను అదుపులోకి తీసుకుని చేసిన విచారణలో తానే అమ్మను చంపాను అనే విషయం ఒప్పుకున్నాడనీ పోలీసులు సంబంధించిన వివరాలు శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మహేష్ పెళ్లి కోసం దాచమని పంపిన డబ్బులు పని లేక జులాయిగా తిరిగే అనిల్ విలాసాలకు వాడుకున్నాడు. సింగపూర్ నుంచి వచ్చిన మహేష్ వివాహం ఈ నెల స్థానిక అమ్మాయితో జరుగాల్సి ఉంది. బ్యాంకులో వెళ్లి చూస్తే అందులో దాదాపు పది లక్షలు ఉండాల్సింది లక్ష మాత్రమే ఉన్నాయి. ఈ నేపథ్యంలో డబ్బులు, బంగారం విషయంలో కుటుంబంలో తగాదా చోటు చేసుకుంది. డబ్బులు పలానా చోట ఉన్నాయి తెస్తా అని చెప్పిన అనిల్ తేలేక పోయాడు. ఆ రోజు గ్రామంలో బంధువుల పెళ్లి కోసం మహేష్ తండ్రి కొమురయ్య వెళ్లగా మహేష్ తిరిగి ఇంటికి వచ్చి పెండ్లి బట్టల కోసం కరీంనగర్ వెళ్లాడు. నిందితుడు ఇదే అదనుగా భావించి అమ్మను చంపితేనే అన్న పెళ్లి ఆగిపోతదని గాఢ నిద్రలో ఉన్న తల్లి గౌరమ్మ నోరు మూసి అనిల్ కర్కశంగా కత్తితో గొంతు కోసి చంపాడని విచారణలో తేలిందని పోలీసులు పేర్కొన్నారు. అతడి నుంచి కత్తి సెల్ఫోన్ స్వాదీనం చేసుకుని నిందితున్ని రిమాండ్ కు పంపినట్టు వారు వివరించారు. గ్రామీణ ఏసీపి విజయ్ కుమార్, సీ ఐ ప్రదీప్ కుమార్, ఎస్ఐ రాజు ఈ విలేకరుల సమావేశంలో ఉన్నారు.

# బీర్ బాటిల్‌లో చేప పిల్ల..

**వేద న్యూస్, హైదరాబాద్**

బీర్ తాగేందుకు వెళ్లిన ఓ వ్యక్తికి ఊహించని సంఘటన ఎదురైంది. కొనుగోలు చేసిన బీర్ బాటిల్‌ను తెరిచిన వెంటనే అందులో ఒక చేపపిల్ల ఈదుతూ కనిపించడంతో అతను ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురయ్యాడు. హైదరాబాద్ నగరంలోని నాచారం పరిధి మల్లాపూర్ ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుని స్థానికంగా కలకలం రేపింది. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతోంది. వివరాల ప్రకారం మల్లాపూర్‌లో ఉన్న జేపీ వైన్ షాపులో శుక్రవారం ఓ వ్యక్తి కింగ్‌ఫిషర్ లైట్ బీర్ బాటిల్ కొనుగోలు చేశాడు. అనంతరం బీర్ తాగేందుకు బాటిల్ మూతను తెరిచాడు. అయితే బాటిల్‌ను తెరిచిన వెంటనే అందులో ఒక చిన్న చేపపిల్ల కదులుతూ కనిపించడంతో అతను ఆశ్చర్యానికి గురయ్యాడు. బీర్ బాటిల్‌లో చేప ఎలా వచ్చిందనే విషయంపై అక్కడ ఉన్నవారు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ విషయంపై వెంటనే కస్టమర్ వైన్ షాపు నిర్వాహకులను ప్రశ్నించాడు. అయితే దీనిపై వారు నిర్లక్ష్యంగా స్పందించినట్లు సమాచారం. బీర్ తయారీ తమది కాదని, ఏదైనా సమస్య ఉంటే తయారీ సంస్థను సంప్రదించాలని చెప్పి కస్టమర్‌తో దురుసుగా మాట్లాడినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో అక్కడ కొంతసేపు వాగ్వాదం కూడా చోటుచేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. దీంతో ఆ వ్యక్తి బీర్ బాటిల్‌లో కదులుతున్న చేపపిల్లను వీడియో



తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. ప్రస్తుతం ఈ వీడియో విస్తృతంగా వైరల్ అవుతోంది. ఈ ఘటనపై అధికారులు దృష్టి సారించి విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఆహార భద్రత, నాణ్యతపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు.

వేద న్యూస్

ఆదివారం మార్చి 08, 2026

# మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

- తీసుకోవడం, కొనడం, అమ్మడం చట్టరీత్యా నేరం
- డాక్టర్ అనితా రెడ్డి



**వేద న్యూస్, హనుమకొండ:**

హనుమకొండలోని ప్రభుత్వ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో అనాథలు, సెమీ ఆర్ఫన్ మరియు వీధి బాలల కోసం మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు, వరల్డ్ వైజ్ కన్స్యూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ నేషనల్ వైస్ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ.. మత్తు పదార్థాలను తీసుకోవడం, కొనడం, అమ్మడం చట్టరీత్యా నేరమని తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసై అనేక మంది తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, విద్యార్థులు అలాంటి అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. అపరిచితులతో సంబంధాలు పెంచుకోవద్దని, ఎవరైనా ప్రలోభపెట్టి ఏదైనా ఇవ్వాలని ప్రయత్నిస్తే స్వీకరించవద్దని హెచ్చరించారు. ప్రతి పాఠశాల, కళాశాలలో యాంటీ ర్యాగింగ్, యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులు ఏవైనా సమస్యలు ఎదుర్కొంటే 100 లేదా 1098 నంబర్లకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా యాంటీ డ్రగ్ అవేర్‌నెస్ పోస్టర్లను ఆవిష్కరించి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా స్టీల్ వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని డాక్టర్ అనితా రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దీప, అరుణ, ఉప్పలయ్య, ప్రసన్న కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# పొంచి ఉన్న ప్రమాదం..

- బ్రిడ్జి వద్ద రక్షణ గోడ లేక ప్రజల్లో ఆందోళన

**వేద న్యూస్, కోనరావుపేట:**



రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండల కేంద్రాన్ని కలుపుతున్న ప్రధాన రహదారిపై నిర్మించిన తాత్కాలిక బ్రిడ్జి ప్రమాద అంచున ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయినప్పటికీ దానికి చుట్టూ ఉండాల్సిన రక్షణ గోడలు (వాల్) నిర్మించకపోవడంతో ప్రమాదం సంభవించే అవకాశం ఉందని విమర్శలు వస్తున్నాయి. ఈ రహదారిపై ప్రతిరోజూ వేలాదిమంది ప్రయాణిస్తుండగా, పోలీస్ స్టేషన్, ఆసుపత్రి, ఎమ్మార్వో, ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లే 28 గ్రామాల ప్రజలు ఈ మార్గాన్నే వినియోగిస్తున్నారు. రహదారి కొంతవరకు సరిగా ఉన్నప్పటికీ బ్రిడ్జి వద్ద భద్రతా చర్యలు లేకపోవడం వల్ల వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందుగానే నివారణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. బ్రిడ్జిపై రక్షణ గోడలు నిర్మించి వాహన దారులకు భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే భవిష్యత్తులో జరిగే ప్రమాదాల కు అధికారులు, ఆర్అండ్‌బీ శాఖ బాధ్యత వహించాల్సి ఉంటుందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# కేసీఆర్ మళ్లీ సీఎం అయితేనే రామరాజ్యం



- మాజీ మంత్రి గంగుల కమలాకర్
- బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు

**వేద న్యూస్, గంగాధర:**

తెలంగాణలో మళ్లీ రామరాజ్యం రావాలంటే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. రామరాజ్యం ఏర్పడాలంటే ముందుగా రావణ సంహారం జరగాల్సిందేనని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేసీఆర్ హయాంలో ఎండాకాలంలో కూడా కాలువలు మత్తడి దూకేవని, నీటి సమృద్ధితో రైతులు సంతోషంగా వ్యవసాయం చేసేవారని గుర్తు చేశారు. ప్రస్తుతం నీటి కొరతతో పంటలు ఎండిపోతున్న పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ నాయకుడు బండి సంజయ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేసీఆర్ పేరు ప్రస్తావించకుండా ఒక్కరోజు కూడా ఉండలేరని విమర్శించారు. కేసీఆర్‌పై విమర్శలు చేయడమే వారి రాజకీయంగా మారిందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో బీఆర్ఎస్ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ప్రజలకు ఉపయోగపడే పనులు కనిపించడం లేదని ఆరోపించారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్ని హామీలను అమలు చేస్తామని గంగుల కమలాకర్ తెలిపారు.

# సూరయ్యపల్లె అభివృద్ధికి రూ.15 లక్షలు మంజూరు

- మంత్రి శ్రీధర్ బాబుకు గ్రామస్తుల కృతజ్ఞతలు



**వేద న్యూస్, మంథని:**

మంథని మండలం సూరయ్యపల్లె గ్రామ అభివృద్ధి కోసం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు రూ.15 లక్షల నిధులు మంజూరు చేసినట్లు గ్రామ నాయకులు తెలిపారు. గ్రామంలోని వివిధ అభివృద్ధి పనుల కోసం గతంలో రూ.1 కోటి నిధులు మంజూరు చేసిన మంత్రి, తాజాగా మరో రూ.15 లక్షలు మంజూరు చేయడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సూరయ్యపల్లె గ్రామ మాజీ వార్డు సభ్యుడు, యూత్ కాంగ్రెస్ నాయకుడు ఎరుకల సురేష్ గ్రామ ప్రజల తరఫున మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి ఆయన అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు.

# ఎండిన పంటలను పరిశీలించిన హరీష్ రావు

- గోపాలరావుపల్లిలో రైతుల సమస్యలు తెలుసుకున్న మాజీ మంత్రి

**వేద న్యూస్, గంగాధర:**



గంగాధర మండలం గోపాలరావుపల్లి గ్రామంలో ఎండిపోయిన పంటలను మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నీటి కొరత కారణంగా పంటలు ఎండిపోయి తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నామని రైతులు ఆయనకు తెలిపారు. దీనిపై స్పందించిన హరీష్ రావు రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు సకాలంలో నీరు అందడం లేదని, రైతుబంధు వంటి పథకాల అమలులో కూడా లోపాలు ఉన్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సమయంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించి వ్యవసాయాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని రైతులకు అవసరమైన నీటిని అందించాలని హరీష్ రావు కోరారు.

# ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు

**వేద న్యూస్, మెట్‌పల్లి ప్రతినిధి:**



మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో ముందస్తుగా మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ నవీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు, మహిళా పారిశుధ్య కార్మికులను శాలువాలతో సత్కరించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి కృషి కుటుంబంతో పాటు సమాజ పురోగతికి దోహదపడుతుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

# 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక'లో పారిశుద్ధ్య పనులు

- కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలో ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య పనులు నిర్వహించారు. గ్రామ పీహెచ్‌సీ వద్ద సర్పంచ్ ఏనుగుల కనకయ్య అధ్యక్షతన చేపట్టిన ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్, పీహెచ్‌సీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి పాల్గొని పనులను పరిశీలించారు. అనంతరం ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న కూలీలకు సర్పంచ్ ఏనుగుల కనకయ్య ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం. శ్రీనివాస్, ఏఎన్ఎం సునీత, టీఏ ప్రవీణ్, ఆశా వర్కర్లు సుజాత, నీరజ, ఎఫ్ఏ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

# సివిల్స్ విజేతలకు అభినందనలు

- బోయినిపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు పరశురామ్

**వేద న్యూస్, బోయినిపల్లి:**



సివిల్స్ తుది ఫలితాల్లో విజయం సాధించిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన అభ్యర్థులకు బోయినిపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు పరశురామ్ ఎడపల్లి అభినందనలు తెలిపారు. క్రమశిక్షణ, అంకితభావం, స్పష్టమైన లక్ష్యంతో చేసిన కృషి ఈ విజయానికి కారణమైందని ఆయన పేర్కొన్నారు. సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన యువత కూడా కష్టపడి చదివి దేశంలోని అత్యున్నత సేవలైన సివిల్ సర్వీసుల్లో స్థానం సంపాదించగలరని ఈ ఫలితాలు మరోసారి నిరూపించాయని అన్నారు. దేశ అభివృద్ధి, సుశాసన సాధనలో సివిల్ సర్వీసులకు కీలకమైన పాత్ర ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈసారి ఎంపికైన అభ్యర్థులు ప్రజాసేవను ధ్యేయంగా తీసుకుని దేశాభివృద్ధికి తమ వంతు సేవలు అందించాలని ఆకాంక్షించారు. అలాగే ఈ విజయాలను ఆదర్శంగా తీసుకుని బోయినిపల్లి మండల యువత ఉన్నత లక్ష్యాలతో కష్టపడి చదివి భవిష్యత్తులో సివిల్ సర్వీసుల్లో రాణించాలని ఆయన సూచించారు.

# 'కేసీఆర్ కప్' అందజేసిన హరీష్ రావు

**వేద న్యూస్, గంగాధర:**



కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలో ఎడ్ల అనిల్, అనుష్ ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌కు శనివారం తెరపడింది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 90 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ రాష్ట్ర మంత్రి తన్నీరు హరీష్ రావు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. మాల్యాల్ జట్టు మొదటి బహుమతి గెలుచుకోగా, గంగాధర క్రికెట్ అసోసియేషన్ రెండవ స్థానంలో నిలిచింది. శ్రీహరి సోల్జర్స్ మూడవ స్థానం, రామడుగు రాయల్స్ నాలుగవ స్థానం దక్కించుకున్నాయి. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సంకే రవిశంకర్, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణ, వీర్ల వెంకటేశ్వర్లు, మాజీ గ్రంథాలయ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ యువ నాయకుడు ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు. క్రీడాకారులు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# యువత భవిష్యత్తుతో ఆడుకుంటున్న ప్రభుత్వం

- మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు గబ్బర్ సింగ్ విమర్శలు



**వేద న్యూస్, చందుర్తి:**

రాజీవ్ యువ వికాసం పథకం పేరుతో ప్రకటనలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో సరిపడ నిధులు కేటాయించకుండా యువతను మోసం చేస్తోందని చందుర్తి మండల బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు భుక్య గబ్బర్ సింగ్ విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ పథకం ద్వారా ఎంతమందికి లబ్ధి చేకూరిందో, ఏ జిల్లాల్లో ఎంతమందికి సహాయం అందిందో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. యువత భవిష్యత్తుతో ఆడుకుంటున్న ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. తక్షణమే ఈ పథకానికి అవసరమైన నిధులు విడుదల చేయాలని, లేనిపక్షంలో యువత ప్రభుత్వం పై తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు.

వేద న్యూస్

ఆదివారం మార్చి 08, 2026

# పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

- 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల డిమాండ్
- ఇందిరాపార్క్ వద్ద మహా విజ్ఞాపన సభ




**వేద న్యూస్, చందుర్తి:**

పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మహా విజ్ఞాపన సభ నిర్వహించారు. ఈ సభకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి మూడు వేల మందికి పైగా ఉపాధ్యాయులు హాజరయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి కూడా వంద మందికి పైగా ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొని పాత పెన్షన్ విధానం అవసరాన్ని ప్రభుత్వానికి తెలియజేశారు. 2004 సెప్టెంబర్ 1కు ముందు నోటిఫికేషన్, రాత పరీక్షలు, ఫలితాలు విడుదలైనప్పటికీ నియామక ప్రక్రియ ఆలస్యమవడంతో తాము కొత్త పెన్షన్ విధానంలోకి వెళ్లాల్సి వచ్చిందని ఉపాధ్యాయులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మెమో నం. 57/4, 57/5తో పాటు తెలంగాణ హైకోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకుని 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మహా విజ్ఞాపన సభలో రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి కన్వీనర్ ఎడ్ల కిషన్, కోశాధికారి వంగ తిరుపతి, కో కన్వీనర్లు అంబటి శంకర్, గుర్రం మల్లారెడ్డి, మధుసూదన్, పులి రాంగోపాల్, మల్లిఖార్జున్, శ్రీనివాస్, సంధ్య, పద్మ, భాగ్యలక్ష్మి, స్వరాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# కేయూలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక ప్రారంభం

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కాకతీయ విశ్వవిద్యాలయంలో 10 రోజులపాటు నిర్వహించనున్న ప్రజా పాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు ప్రారంభమైనట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం తెలిపారు. కార్యక్రమంలో భాగంగా యూనివర్సిటీలోని వివిధ కళాశాలలు, విభాగాలు, కార్యాలయాలలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు చేపట్టారు. విభాగాల పరిసరాలు, కార్యాలయాలు, ల్యాబొరేటరీలను శుభ్రపరిచడంతో పాటు ఫర్నిచర్ అమరికలను సక్రమంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది చురుకుగా పాల్గొన్నారు. తదుపరి కార్యక్రమాలుగా యూనివర్సిటీ క్యాంపస్‌లోని కార్యాలయాలు, విభాగాలు, హాస్టళ్లలో శుభ్రత కార్యక్రమాలు, అవగాహన కార్యక్రమాలు, ఫైల్ నిర్వహణ, ల్యాబొరేటరీల సక్రమ నిర్వహణ వంటి అంశాలను కూడా అమలు చేయనున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను సర్క్యులర్ రూపంలో ఇప్పటికే అన్ని విభాగాలకు పంపినట్లు పేర్కొన్నారు.

# కేయూ విద్యా కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలు

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకతీయ విశ్వవిద్యాలయం విద్యా కళాశాలలో శనివారం ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లాని శ్రీనివాస్ మహిళా ఉపాధ్యాయులు, మహిళా సిబ్బందిని శాలువాలతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... మహిళలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, తమ హక్కులపై అవగాహన పెంపొందించుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. లింగ సమానత్వం సాధించడం సమాజ పురోగతికి ఎంతో అవసరమని, ప్రతి సంవత్సరం మార్చి 8న జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవం మహిళల కృషి, త్యాగాలను గుర్తు చేసుకునే రోజు అని పేర్కొన్నారు. మహిళలకు సమాన అవకాశాలు, హక్కులు, రక్షణ కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షమీమ్ సుల్తానా, డాక్టర్ ఎస్.ఎస్. స్వర్ణలత, పి. శ్రీదేవి, డాక్టర్ డి. కళ్యాణి, జి. అపర్ణదేవి, బి. సునీత, ఏ. లావణ్య, డాక్టర్ వేణుమాధవ్, డాక్టర్ మాణిక్యం, డాక్టర్ బండి వేణు, ఎం. మనోహర్, కె. శ్రీనివాస్, పి. లక్ష్మయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

# దిశ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే గండ్ర

**వేద న్యూస్, శాయంపేట:**



హనుమకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం (ఐడీఓసీ)లో ఎంపీ కడియం కావ్య అధ్యక్షతన నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొన్నారు. సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలపై అధికారులు వివరాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. శాయంపేట మండలంలోని ప్రభుత్వ గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో టాయిలెట్ సౌకర్యాలు, కిచెన్ షెడ్లు, తాగునీటి సదుపాయాలు కల్పించాలని అధికారులను సూచించారు. అలాగే కోతుల బెడదను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మండలంలోని గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సమస్యలు లేకుండా చూడాలని, అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేసి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో దిశ వైస్ చైర్మన్ బండా ప్రకాష్, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు, ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్పై, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# మోటార్లు వాడుతూ కాళేశ్వరం లేదంటారా

- ప్రాజెక్టుతో వేలాది ఎకరాల పంటలు పండుతున్నాయి
- సీఎం రేవంత్ రెడ్డిపై హరీష్ రావు ఫైర్

**వేద న్యూస్, గంగాధర:**



వరద కాలువలో ప్రవహిస్తున్న నీళ్లు కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించినవేనని, కాళేశ్వరం మోటార్లను వినియోగిస్తూ ప్రాజెక్టు లేదని చెప్పడం ముఖ్యమంత్రి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు అన్నారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల సమీపంలోని వరద కాలువను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఉద్దేశపూర్వకంగా అపప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం అనేది మూడు ప్రధాన బ్యారేజీలు, వందకు పైగా భాగాలతో కూడిన భారీ ప్రాజెక్టు అని, దీని ద్వారా వేలాది ఎకరాల్లో పంటలు పండుతున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో పూర్తికాని ఎల్లంపల్లి, మిడ్ మానేర్ వంటి ప్రాజెక్టులను బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేసిందని పేర్కొన్నారు. వరద కాలువ పునర్జీవన పథకం కింద కూడా భారీగా పనులు చేపట్టినట్లు చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల్లో ఒక కాలువ కూడా తవ్వలేదని, చెక్‌డ్యామ్ కూడా నిర్మించలేదని విమర్శించారు. రైతుబంధు, పెన్షన్లు వంటి హామీలను కూడా అమలు చేయలేదని ఆరోపించారు. రైతులకు సాగునీరు అందించే విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని హరీష్ రావు డిమాండ్ చేశారు.

# పంచాయతీ కార్యదర్శికి భావోద్వేగ వీడ్కోలు

- గ్రామ అభివృద్ధికి కృషి చేసిన రవికి సన్మానం

**వేద న్యూస్, బోయినిపల్లి:**





రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కోరేం గ్రామంలో గ్రామ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసి ప్రజలకు సేవలందించిన గ్రామపంచాయతీ కార్యదర్శి రవి బదిలీపై వెళ్లడంతో గ్రామ ప్రజలు భావోద్వేగంతో వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు, ప్రజలు కలిసి రవిని శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఆయన గ్రామంలో పనిచేసిన కాలంలో చేసిన సేవలను గుర్తుచేసుకుంటూ అభినందనలు తెలిపారు. గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడంలో, ప్రజలకు అవసరమైన సేవలు అందించడంలో రవి కీలక పాత్ర పోషించారని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆయన మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని గ్రామ ప్రజలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డా. చెన్నాడి అమిత్ కుమార్, డబ్బు సృజన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ జంపుక మాధవి ఆనంద్, ఉప సర్పంచ్ స్వామి రెడ్డి, వార్డు సభ్యులు బాలు, మహేష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై రవికి శుభాకాంక్షలు తెలిపారు.

# వృద్ధురాలైన తల్లిని కొట్టిన ఘటన..

- ఇంటి వద్దకే వెళ్లి కేసు నమోదు చేసిన పోలీసులు

**వేద న్యూస్, మడికొండ:**



హనుమకొండ జిల్లా కాజీపేట పట్టణం మడికొండ గ్రామంలో వృద్ధురాలైన తల్లిని కొట్టిన ఘటనపై పోలీసులు ఇంటి వద్దకే వెళ్లి కేసు నమోదు చేశారు. మడికొండకు చెందిన వస్కుల శాంత (72) అనే మహిళ రైల్వే శాఖలో పనిచేసి రిటైర్డ్ అయ్యారు. ఆమెకు ఐదుగురు కుమారులు ఉన్నారు. శుక్రవారం ఉదయం మూడవ కుమారుడు వస్కుల రామును భోజనం పెట్టమని అడగగా అతడు కోపంతో తిట్టడంతో పాటు అతని భార్య సుమలత, నాల్గవ కుమారుని భార్య కల్పన కలిసి వృద్ధురాలిని కొట్టినట్లు సమాచారం. ఈ దాడిలో రాముడు రాయితో తలపై కొట్టడంతో ఆమె తలకు గాయం కాగా ఎడమ చేయి విరిగినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న మరో కుమారుడు శంకర్ ఆమెను ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం శనివారం నడవలేని పరిస్థితిలో ఉన్న వృద్ధురాలు 100కి ఫోన్ చేయడంతో మడికొండ సీఐ పుల్యాల కిషన్ స్వయంగా ఆమె ఇంటికి వెళ్లి ఫిర్యాదు స్వీకరించారు. అనంతరం భారతీయ న్యాయ సంహిత సెక్షన్లతో పాటు వృద్ధుల సంరక్షణ చట్టం-2007 ప్రకారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ పుల్యాల కిషన్ మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు రాలేని పరిస్థితిలో ఉన్న బాధితుల వద్దకే వెళ్లి ఎఫ్ఐఆర్ నమోదు చేసే విధానాన్ని తెలంగాణ పోలీసులు అమలు చేస్తున్నారని చెప్పారు. వృద్ధులను దూషించడం, కొట్టడం వంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎఫ్ఐఆర్ నమోదు అనంతరం బాధితురాలు వస్కుల శాంతకు ఎఫ్ఐఆర్ ప్రతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో మడికొండ ఎస్సై రాజ్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంకెన్ని ప్రాణాలు పోతే స్పందిస్తారో..!?

- రోడ్డు పై సూచిక బోర్డులు కరువు

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ – వర్ని రోడ్డు విస్తీర్ణ పనుల నేపథ్యంలో మండలంలోని అక్బర్ నగర్ రహదారి ప్రక్కన డ్రైనేజీ నిర్మాణం చేసి మధ్యలోనే పనులను నిలిపివేశారు. అక్కడ ఎలాంటి సూచిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో ఆ డ్రైనేజీలో పడి ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటివరకు చాలా ప్రమాదాలు జరిగాయని, ప్రాణాలు పోయినా కూడా రోడ్డు నిర్మాణ సంస్థ అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అనేక ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయని గ్రామస్తులు వాపోయారు. రాత్రి వేళల్లో రేడియం స్టిక్కర్లు లేని బోర్డులు, మూలమలుపుల వద్ద హెచ్చరికలు లేకపోవడంతో వాహనాలు అదుపుతప్పి, బోల్తా పడి ప్రాణ నష్టం సంభవిస్తోంది. రోడ్డు పనులు జరుగుతున్నా, రేడియం స్టిక్కర్లు లేదా హెచ్చరిక లైట్లు లేని బోర్డుల వల్ల రాత్రి సమయాల్లో వేగంగా వచ్చే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. జాతీయ రహదారుల విస్తీరణ, డ్రైనేజీ పనుల వద్ద కనీస హెచ్చరిక బోర్డులు లేకపోవడం వల్ల వాహనాలు గుంతల్లో పడటం లేదా నిర్మాణ సామాగ్రిని ఢీకొట్టడం జరుగుతోంది. ఇప్పటికైనా సంబంధిత రోడ్డు నిర్మాణ సంస్థ అధికారులు స్పందించి ప్రమాదాలు సంభవించకుండా రోడ్డుపై సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు.

వేద న్యూస్
ఆదివారం మార్చి 08, 2026

# విద్యాశాఖలో ఖమ్మం రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలి

## – కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**

విద్యాశాఖలో ఖమ్మం జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హైస్కూల్ హెడ్ మాస్టర్లు, ఎం.ఈ.ఓ. లతో విద్యాశాఖపై జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ... కలెక్టర్ గా బాధ్యతలు తీసుకున్న తర్వాత అధికంగా ప్రాథమిక విద్యపై ఫోకస్ పెట్టడం జరిగిందన్నారు. విద్యాశాఖ పని తీరులో ఖమ్మం జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందని కలెక్టర్ తెలిపారు. 99 రోజుల ప్రణాళిక కట్టుదిట్టంగా నిర్వహించడంతో పాటు, రాబోయే 10వ తరగతి పరీక్షలో ప్రభుత్వ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు.99 రోజుల కార్యాచరణలో భాగంగా మార్చి 6 నుంచి మార్చి 15 వరకు పారిశుధ్య నిర్వహణ ప్రధాన అంశంగా చేపట్టామని, ప్రతి పాఠశాలలో పనికి రాకుండా ఉన్న పాత సామాగ్రి, కంప్యూటర్, రిజిస్టర్ లు డిస్పోజ్ చేయాలని కలెక్టర్ సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేకంగా 70 లక్షల రూపాయలు ప్రభుత్వ పాఠశాలలకు నిధులు అందిస్తున్నామని, ఆ నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేస్తూ పాఠశాలలో అవసరమైన పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి పాఠశాలలో ఫైల్ నిర్వహణ చాలా క్లీన్ గా ఉండాలన్నారు. టాయిలెట్ లలో ఎటువంటి సమస్యలు ఉన్నా స్థానిక సంస్థల అధికారుల సమన్వయంతో పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి పాఠశాలకు ఉన్న సామాగ్రి, ఆస్తుల వివరాలు సంక్షిప్తంగా రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. మార్చి 14 నుంచి ఏప్రిల్ 13 వరకు జరిగే 10వ తరగతి పరీక్షల నేపథ్యంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని అన్నారు. ప్రతి పరీక్ష మధ్య ఉన్న గ్యాప్ లో ఉపాధ్యాయులు విద్యార్థులకు తోడుగా ఉంటూ ఒత్తిడి తగ్గించాలని కలెక్టర్ తెలిపారు. 10వ తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించడం వల్ల పిల్లల కెరీయర్ కు మంచి ఫౌండేషన్ ఉంటుందని అన్నారు. విద్యార్థులు వీక్ గా ఉన్న సబ్జెక్టుల్లో ముఖ్యమైన పాఠ్యాంశాలు అనేకసార్లు ప్రాక్టీస్ చేసే విధంగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని, విద్యార్థి ఒత్తిడితో ఉంటే వచ్చింది కూడా రాయలేకపోతారని, ఎటువంటి ఒత్తిడి లేకుండా పరీక్షలకు హాజరయ్యే విధంగా ఉపాధ్యాయులు చూడాలని కలెక్టర్ అన్నారు. పరీక్ష రాసిన తర్వాత దాని గురించి అనవసరపు చర్చలు పెట్టకుండా జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాల సరిగ్గా నిర్వహించేందుకు స్టాఫ్ అటెండెన్స్ చాలా కీలకమని, 90 శాతం ఉపాధ్యాయుల హాజరు ఉన్న పాఠశాలలు మంచి ప్రోగ్రెస్ కనబరిచాయని అన్నారు. స్టాఫ్ రెగ్యులర్ గా వస్తే విద్యార్థుల హాజరు, విద్యా ప్రమాణాలు ఆటోమేటిక్ గా పెరుగుతాయని అన్నారు. ఉపాధ్యాయులు లీవ్ తీసుకోకుండా పాఠశాల విధులకు గైర్హాజరు కావడానికి వీలు లేదని, ఎటువంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరైతే చర్యలు ఉంటాయని కలెక్టర్ స్పష్టం చేశారు. 99 రోజుల కార్యాచరణ ముగిసే నాటికి జిల్లాలో 100 శాతం విద్యార్థులకు ఆధార్, అపార్ నెంబర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను సంబంధిత హెడ్ మాస్టర్, ఉపాధ్యాయులు రెగ్యులర్ గా చెక్ చేయాలని అన్నారు. ఎవ్రీ చైల్డ్ రీడ్స్ ద్వారా ప్రాథమిక పాఠశాల లోని విద్యార్థుల విద్యా ప్రమాణాలు గణనీయంగా మెరుగయ్యాయని, రాబోయే సంవత్సరంలో ఉన్నత తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యాచరణ అమలు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. విద్యాశాఖ పరిధిలో ఖమ్మం జిల్లా రాష్ట్రానికి ఆదర్శవంతంగా నిలిచేలా అధికారులు పనిచేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం హాజరు తక్కువగా ఉన్న పాఠశాలల వారిగా కారణాలు తెలుసు కుంటూ భవిష్యత్తులో మెరుగ్గా పని తీరు చూపించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఈఓ చైతన్య జైనీ, విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సి.హెచ్. రామకృష్ణ, సీఎంఓ ప్రవీణ్, మండల విద్యాశాఖ అధికారులు, హెడ్ మాస్టర్ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి మారుపేరు తుమ్మల

## – నాగండ్ల దీపక్ చౌదరి

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**



మంత్రి తుమ్మల నాగేశ్వరావు నీతి,నిజాయితీకి, అభివృద్ధికి మారుపేరని జిల్లా కాంగ్రెస్ కమిటీ, ఖమ్మం కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి అన్నారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జరిగిన మీడియా సమావేశంలో నాగండ్ల దీపక్ చౌదరి పాల్గొని మాట్లాడుతూ.. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అవాకులు చెవాకులు మానుకోవాలని హితవు పలికారు.బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, పువ్వాడ అజయ్ కుమార్ భూదాన్ పేదలను కల్లబొల్లి కబుర్లతో మభ్యపెడుతున్నారని, ఈ భూములపై గత ప్రభుత్వ హయాంలో కోర్ట్ లో వేశారని అట్టి తీర్పు ఈనాటికి వెలువడిందని, మాజి మంత్రి పువ్వాడ పది సంవత్సరాలు కళ్ళ మూసుకొని ఉన్నావా,భూదాన్ పేదలను మభ్యపెట్టి వారి దగ్గర డబ్బులు వసూలు చేసావని అన్నారు. ఇకనైనా అనవసర ఆరోపణలు మాని అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అదే విధంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నాలుగు దశాబ్దాల చరిత్ర గల నీతి నిజాయితీకి జిల్లా అభివృద్ధికి ఏ విధంగా పాటుపడ్డారో జిల్లా ప్రజలందరికీ తెలుసని, తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నియోజక వర్గంలో గెలిచినప్పటి నుండి నియోజకవర్గం దినదినాభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతున్నారన్నారు. అటువంటి వారిపై నిందలు వేయటం ఆకాశంపై ఉమ్మి వేసిన చందంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు నగర ఐ యన్ టి యు సి అద్యక్షులు నరాల నరేష్ నాయుడు, నగర ఓ బి సి సెల్ అద్యక్షులు బాణాల లక్ష్మణ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కల్వకుంట్ల గోపాల్, కన్నం వైష్ణవి, ప్రసన్న కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఆఫీసులో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

**వేద న్యూస్, మందమర్రి :**



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మందమర్రి మున్సిపల్ కార్యాలయంలో మెప్మా సిబ్బంది, కార్యాలయ మహిళా సిబ్బంది కలసి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి, వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి మహిళా దినోత్సవాని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజ లింగం మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మార్చి 8న జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవాని ఐక్యరాజ్యసమితి గుర్తించిందని తెలిపారు. మహిళలు అన్ని రంగాలలో ఉండాలని పేర్కొన్నారు. భారతదేశ తొలి మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే చేసిన సేవలను గుర్తు చేశారు. పూణే లో మొదటి బాలికల పాఠశాలను స్థాపించి మహిళల అట్టడుగు వర్గాల విద్య కోసం గొప్పగా కృషి చేశారని తెలిపారు. సమాజంలో ఎన్నో అవమానాలను ఎదుర్కొన్న వెనుకడుగు వేయకుండా మహిళా విద్యకు పునాదివేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. మహిళలు అన్ని రంగాలలో ముందుకు సాగి సమాజ అభివృద్ధిలో ముఖ్యపాత్ర పోషించాలని ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఆఫీసర్ పి కృష్ణ ప్రసాద్, మేనేజర్ టి రాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్లు ఏ రాణి, ఈ రాజేశ్వరి, మహిళా వార్డు అధికారులు, ఆయుర్వేది క్ డాక్టర్ నీరజ, ఇన్చార్జి టి ఎం సి రఘురాం, అలాగే 24 వార్డుల మే ప్మా రిసోర్స్ పర్సన్ లు, ఓబీలు, వార్డు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతర

**వేద న్యూస్, గీసుకొండ :**



వరంగల్ జిల్లా గీసుకొండ మండలం కొమ్మాల గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతర సంవత్సరానికి ఒకసారి జరుగుతుంది. హోలీ పాల్గుణ పౌర్ణమి నుండి ఐదు రోజులపాటు జరిగే జాతరకు వరంగల్ పూర్వపు జిల్లా నుండి వేలాది మంది భక్తులు వచ్చి వారి మొక్కలు చెల్లించుకున్నారు. రైతులు తమ మొదటి పంట నుండి వచ్చిన పంటను స్వామివారికి సమర్పించేందుకు తీరొక్కరూపంలో ప్రభ బండ్లు అనంకరణ చేసి ఆ బండ్ల లో కుటుంబ సమేతంగా జాతరకు వచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకుంటారు. భక్తుల కోసం లక్ష్మీనరసింహస్వామి వారి మొక్కలు చెల్లించుకోవడానికి సాక్షాత్తు కిందికి దిగివచ్చి రథంలో గుడి చుట్టు ప్రదక్షిణలు చేసే క్రమంలో భక్తులు వారి యొక్క మొక్కులు అందరూ చెల్లించుకుని లక్ష్మి నరసింహ స్వామి గోవిందా గోవిందా అంటూ భక్తిశ్రద్ధలతో స్వామిని కొలుస్తారు. ఈ ప్రాంత రాజకీయ నాయకులు తమ బలాలను నిరూపించేసుకోవడానికి గ్రామాలలోని ప్రజలు తమ పార్టీ కార్యకర్తలతో తీరొక్క రూపాలలో ప్రభ బండ్లను తయారచేసుకొని డప్పు వాయిద్యాలు, కోలాటాలు, డిజిఏ సౌండ్స్‌తో డ్యాన్సులు చేస్తూ ఒక్కరిపై ఒక్కరు నినాదాలు చేసుకుంటు జతరకు బయలుదేరడం జరుగుతుంది.

# మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే చర్యలు తప్పవు

## – పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**

కాకతీయ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన విద్యార్థులపై చర్యలు తీసుకుంటామని విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల తెలిపారు. బి.ఫార్మసీ మూడవ సెమిస్టర్ పరీక్షల్లో నగరంలోని శివాని ఫార్మసీ కాలేజీ పరీక్షా కేంద్రంలో నలుగురు, హనుమకొండలోని వాగ్దేవి కాలేజీ ఆఫ్ ఫార్మసీ పరీక్షా కేంద్రంలో నలుగురు, సహస్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ పరీక్షా కేంద్రంలో తొమ్మిది మంది విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడినట్లు గుర్తించి బుక్ చేసినట్లు తెలిపారు. అలాగే పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షల్లో వరంగల్‌లోని ఎల్‌బి కాలేజీ పరీక్షా కేంద్రంలో ఒక విద్యార్థిని మాల్ ప్రాక్టీస్ కింద బుక్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ విద్యార్థులపై విశ్వవిద్యాలయ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు, అవసరమైన కేంద్రాల్లో ప్రత్యేక స్క్వాడ్‌లను కూడా ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

# కుక్కల దాడిలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు

**వేద న్యూస్, రుద్రూర్ :**



కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. రుద్రూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి శుక్రవారం రాత్రి కుక్క కరవడంతో కాలికి తీవ్ర గాయం అయ్యింది. వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. రుద్రూర్ గ్రామంలో వీధి కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తు ప్రజలపై దాడికి గురిచేస్తున్నాయి. రాత్రి సమయాలలో సైతం రోడ్లపైకి వచ్చి నడుచుకుంటూ వేళ్లే వారిపై వీధి కుక్కలు దాడులకు పాల్పడుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల బెడద నుండి రక్షించాలని గ్రామస్తులు కోరారు.

# ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని చిన్నప్పటి నుంచే అలవర్చుకోవాలి

## – ప్రముఖ వైద్యులు ప్రవీణ్ కుమార్



**వేద న్యూస్, పాపన్నపేట :**

ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని చిన్నప్పటినుండే అలవర్చుకోవాలని బసవ తారకం క్యాన్సర్ వైద్యశాల ప్రముఖ వైద్యులు ప్రవీణ్ కుమార్ అన్నారు. పాపన్నపేట ఉన్నత పాఠశాలలో శనివారం విషయ నిపుణులతో సంభాషణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య వక్త గా విచ్చేసి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మంచి అలవాట్లు మంచి జీవితాన్ని నిర్మిస్తాయని అన్నారు. అదే విధంగా కెరీర్ గైడెన్స్ పై చార్టెడ్ అకౌంటెంట్ వంశిధర్ విద్యార్థులకు ఏ కోర్సు ,ఏ విధంగా ఎన్నుకోవాలో , కోర్సులో రాణించాలంటే ఏవిధమైన నైపుణ్యాలు ఉండాలో తెలిపారు. రోల్ మోడల్ గా విచ్చేసిన ప్రియాంక బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని , ధైర్యం గా ఉండాలని ,చదువుతోనే అన్ని సాధ్యమని అన్నారు.అనంతరం కెరీర్ గైడెన్స్ కరపత్రాలను ఆవిష్కరించారు. వారిని ప్రధానోపాధ్యాయులు మహేశ్వర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో మండల విద్యాధికారి ప్రతాప్ రెడ్డి , ఉపాధ్యాయులు వెంకటేశం అంజా గౌడ్ నాగరాజు యాదయ్య, రియాజ్, కృష్ణ కాంత్ ,మోహన్ రావు నర్సింలు రమేష్ విశ్వనాథ్ ఇందిరా పద్మ, అన్నపూర్ణ, రజిత , లక్ష్మి, సుభాష్ ,శ్రీను పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ అందజేత


**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి:**



ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ప్రత్యేక చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి ( సీఎంఆర్ఎఫ్ ) ద్వారా కారేపల్లి మండలం మాదారం గ్రామానికి చెందిన గుంపెనపల్లి విజయలక్ష్మి కి రూ. 2, 50,000విలువ చేసే ఎల్ వోసీ ( లెటర్ ఆఫ్ క్రెడిట్ ) మంజూరైంది. తీవ్రమైన కీళ్ల నొప్పులతో బాధపడుతున్న బాధితురాలు ఇటీవల ఎంపీ రఘురాం రెడ్డి ని కలిసి.. తన గోడును వెళ్ళబోసుకోగా.. మానవతా దృక్పథంతో స్పందించిన ఎంపీ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేశారు. దీంతో.. నిజామ్స్ మెడికల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో మెరుగైన వైద్య చికిత్స అందిం చేందుకు.. రూ. 2.50లక్షలను కేటాయించగా.. ఆ మంజూరు పత్రాన్ని బాధితురాలి కుటుంబ సభ్యులకు ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి శనివారం హైదరాబాద్ లోని తన నివాసంలో అందజేసి, విజయలక్ష్మి త్వరగా కోలుకొని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తమ బాధ తెలుసుకొని వైద్య చికిత్స కు అండగా నిలిచిన పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డికి బాధితురాలి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# గుండెపోటుతో రెడ్ క్రాస్ సొసైటీ పాలక మండలి సభ్యురాలు మృతి

**వేద న్యూస్, హనుమకొండ:**



ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ జిల్లా పాలక మండలి సభ్యురాలు చెన్నమనేని జయశ్రీ గుండెపోటుతో అకస్మాత్తుగా మృతి చెందారు. జయశ్రీ మరణం పట్ల రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ జిల్లా పాలక మండలి సభ్యులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సమాజ సేవా కార్యక్రమాల్లో ఆమె చురుకుగా పాల్గొని రెడ్ క్రాస్ కార్యక్రమాల అభివృద్ధికి విశేషంగా కృషి చేసినట్లు సభ్యులు పేర్కొన్నారు. ఆమె సేవలను ఈ సందర్భంగా స్మరించుకుంటూ జయశ్రీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అలాగే ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ జిల్లా పాలక మండలి సభ్యులు, సిబ్బంది తెలియజేశారు.

వేద న్యూస్

ఆదివారం మార్చి 08, 2026

# మంజుల అనే నేను..



గాయాల్ని గుండెల్లో దాచుకుని
గర్వంగా నవ్వడం నేర్చుకున్నాను!
పడిపోతూ కూడా నిలబడటం నేర్చుకున్నాను!
నిశ్శబ్దంగా కనిపించినా
నిర్ణయాల్లో గర్జించే శక్తిని నేను!
నేను మహిళను మాత్రమే కాదు
మార్పుకు మొదటి అడుగు నేను!
నన్ను ఆపాలని ప్రయత్నించిన చేతులు
ఇప్పుడు నా విజయానికి చప్పట్లు
కొడుతున్నాయి!
నన్ను ఆపాలని వచ్చిన చీకట్లు
ఇప్పుడు నా వెలుగుకే దారి చూపించాయి!
కన్నీరు పొంగిన ప్రతి క్షణం
నా గుండెల్లో విప్లవం మేల్కొంటుంది!
నన్ను ఆపాలని వచ్చిన ప్రతి మాట
ఇప్పుడు నా విజయ గీతంగా మారుతోంది!
నేను వంటింటి పొగ కాదు
నిరాశలో ఉన్న మహిళా హృదయాలకు
ఆశ నింపి
వెలుగుజ్యోతిని వెలిగించాను!
నన్ను అబల అని అన్న వారందరికీ
సహనాన్ని ఆయుధంగా మార్చుకొని
నాయకురాలిగా దారులు చూపించాను!
ఇల్లు నుంచి దేశం వరకు
ప్రతి రంగంలో వెలుగునిచ్చే
ప్రతి మగువకు నా హృదయపూర్వక
వందనాలు తెలుపుతూ...
అంతర్జాతీయ మహిళా దినోత్సవ
శుభాకాంక్షలు.

మంజుల పత్తిపాటి (కవయిత్రి).
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ
డైరెక్టర్.

# ఓ మగువ నీకు వందనం





మహిళా అంటే ఒక శక్తి
సృష్టికి మూలం మహిళ
మహిళతోనే మనుగడ
మరువలేము నీ త్యాగం!!
ఆమె సహనానికి మారుపేరు
అక్క చెల్లి అమ్మగా తనదైన పాత్ర
మహిళా నీకు శతకోటి వందనాలు
ఆత్మగాళ్ళు మనసుకలిగిన మహిళ!!
ఆమె ఒక అమ్మ ఒక నాన్న
ఆమె పొద్దుతో పోటీ పడుతుంది
కాలంతో పోటీ పడుతుంది ఆమె
ఈ జగతిన సరిలేరు నీకెవ్వరు!!
ప్రేమ త్యాగం సహనం ఆమె
మగువ మనుగడకే ప్రాణం పోసేది
అవసరానికి ఆసరాగా నిలిచే ధీరత్వం
భూమాతకు ఉండే సహనం ఆమెది!!
అలుపెరుగని ఓర్పు ఆమెది
నిరంతర శ్రమజీవి ఆమె
ఓ మగువా నీకు వందనం
ఆమెతోనే మన జీవన ప్రయాణం!!
మార్చి 8 అంతర్జాతీయ మహిళా
దినోత్సవం సందర్భంగా

రచన:
దేవులపల్లి రమేశ్
కలం: వామిక శ్రీ వర్ష
సిద్దిపేట, నంగునూర్
చరవాణి :9963701294

# ఘనంగా కిండర్ గార్టెన్ గ్రాడ్యుయేషన్ డే

**- పాల్గొన్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్**




**వేద న్యూస్ , జమ్మికుంట:**

జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని అబాది జమ్మికుంట సెయింట్ థామస్ పాఠశాల అధ్యాపకుల ఆహ్వానం మేరకు కిండర్ గార్టెన్ గ్రాడ్యుయేషన్ డే లో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. సెయింట్ థామస్ పాఠశాల ప్రారంభం నుండి చుట్టు పక్కల గ్రామాల పేద పిల్లలకు మంచి నాణ్యమైన విద్య అందించి ..ఎంతో మంది విద్యార్థినీ విద్యార్థులు ఉన్నతస్థాయికి వెళ్ళేలా కృషి చేసిందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్, కౌన్సిలర్లు ఎగిత సుజాత అశోక్, మైస శిరీష రవి, చింతల శ్రీనివాస్, పోల్నేని అజయ్ , కొలుగూరి సురేష్ , మంద రాధ రాజేష్, పోలు దివ్య బిక్షపతి, పోల్నేని శిల్పా వేణు పాఠశాల అధ్యాపకులు చరణ్ తేజ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

**- అదనపు ఎస్పీ మహేందర్**



**వేద న్యూస్, మెదక్ జిల్లా :**

మెదక్ జిల్లా పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన వారాంతపు పరేడ్‌లో జిల్లా అదనపు ఎస్పీ. ఎస్ మహేందర్ పాల్గొని, పోలీసు సిబ్బంది అందించిన గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం పరేడ్‌ను పరిశీలించి పోలీసు సిబ్బందికి క్రమశిక్షణ మరియు శారీరక దృఢత్వంపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, పరేడ్ నిర్వహించడం వల్ల క్రమశిక్షణ, సమయపాలనతో పాటు సిబ్బంది మధ్య సమన్వయం (కోఆర్డినేషన్) పెరుగుతుందని తెలిపారు. ప్రతి పోలీసు అధికారి మరియు సిబ్బంది తమ విధి నిర్వహణలో అత్యంత క్రమశిక్షణతో వ్యవహరించాలని సూచించారు. ఒత్తిడితో కూడిన విధుల్లో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయరాదని, క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ శారీరక మరియు మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు వచ్చే విధంగా అధికారులు మరియు సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం మార్చి 6వ తేదీ నుండి జూన్ 12వ తేదీ వరకు నిర్వహిస్తున్న "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమం గురించి పోలీసు సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 13 నుండి ఏప్రిల్ 18 వరకు "సురక్షితంగా చేరుకోండి (ఎర్రివ్ అలివే )" కార్యక్రమం హోం మరియు రవాణా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతపై అవగాహన, ట్రాఫిక్ నియమాల అమలు, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక తనిఖీలు చేపట్టనున్నట్లు చెప్పారు. అలాగే ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు "పిల్లల భద్రత డ్రగ్స్‌కు నో" కార్యక్రమం పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాల రూపంలో నిర్వహించబడుతుందని జిల్లా అదనపు ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డియస్పి లు ప్రసన్న కుమార్, రంగా నాథ్, మెదక్ టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్, ఆర్ఐ శైలందర్, ఎస్సై మల్లికార్జున్, ఆర్ఎస్సై లు సుభాష్, మహిపాల్, భవాని కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా గుంతలు..పట్టించుకోని అధికారులు..!

**- కలెక్టర్ స్పందిస్తారేమో అని ఆశ పడిన ప్రజలు**



**వేద న్యూస్, నల్లబెల్లి :**

నల్లబెల్లి మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డుపై గుంతలు పడి ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. నిత్యం రద్దీగా ఉంటే ప్రాంతంలో నడిరోడ్డుపై గుంతలు ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. బస్టాండ్ నుండి వరంగల్ వెళ్లే ప్రధాన రహదారిలో నాలుగు రోడ్లు కలిసి ఉన్న కూడలిలో నర్సంపేట కు వెళ్లే మూలమలుపులో గుంతలు ఏర్పడినప్పటికీ అటువైపు వెళుతున్న అధికారులు మాత్రం చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు ఉన్నప్పుడు గుంతలు పూడ్చివేయాలని వేడుకున్నప్పటికీ ప్రయోజనం లేకపోయిందన్నారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక, ఆరోగ్య శిబిరం కార్యక్రమానికి శనివారం కలెక్టర్ సత్య శారద గుంతలు ఉన్న మార్గం గుండానే రైతు వేదిక లో జరుగుతున్న కార్యక్రమానికి వెళ్లి, కార్యక్రమం అనంతరం అదే గుంతలు ఉన్న మార్గం పై నడుచుకుంటూ వచ్చి గుంతలను చూసి కూడా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో కూడా ఈ సమస్యకు పరిష్కారం లభించలేదు. ఉన్న రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారింది. వర్షాలు కురిస్తే రోడ్డుపై వెళ్లాలంటే వాహనాదారులకు ఇబ్బందిగా మారింది. ఈ విషయంలో అధికారులు వెంటనే స్పందించి గొతులు పూడ్చివేసి చర్యలు తీసుకోవాలని నల్లబెల్లి మండల కేంద్ర వాహనదారులు,గ్రామస్తులు కోరుతున్నారు.



# శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగం ఆవిష్కరణ

**వేద న్యూస్, వరంగల్ టౌన్:**

శ్రీ సోమేశ్వర ఆస్ట్రాలజికల్ సెంటర్ వ్యవస్థాపకుడు స్వర్ణకంకణదారి , జ్యోతిష్య బ్రహ్మ శివశ్రీ కాళేశ్వరం సుమన్ శర్మ రూపొందించిన శ్రీ పరాభవ నామ సంవత్సర పంచాంగాన్ని భద్రకాళి దేవస్థానంలో అమ్మవారి సన్నిధానంలో వరంగల్ జిల్లా బిజెపి అధ్యక్షులు గంట రవికుమార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. పూజ అనంతరం మొదటి పంచాంగము ఆగమ సామ్రాట్ భద్రకాళి శేషుకి అందజేశారు. ఈ సందర్భంగా సుమన్ శర్మ మాట్లాడుతూ.. మన హిందూ జీవన సాంప్రదాయ విధానంలో ఉగాది పండుగకు ప్రత్యేకమైన స్థానం ఉన్నది. తిథి వారము నక్షత్రము యోగము కరణముల గురించి సవివరముగా తెలియజేసేదే పంచాంగం అని మరియు భారతీయ జీవన సంస్కృతిలో వేదములు షట్ శాస్త్రములు చాలా ముఖ్యమైనవి. వేద పురుషుని కంగభూతములైన శాస్త్రములు శిక్ష , కల్పము , వ్యాకరణము, నిరుక్తము , చందస్సు మరియు జ్యోతిష్యం. " జ్యోతిషాం అయనం చక్షుః " వేద పురుషునికి జ్యోతిష్య శాస్త్రము కన్నులాంటిది. " జ్యోతిసాం సూర్యాది గ్రహణాం బోధకం శాస్త్రమ్ " జ్యోతిష్యమునకు సాక్షిభూతములు సూర్యచంద్రులు కాల గణనమునకు పంచాంగము ఆధాం భూతము కాగలదు. ఇది ఒక విస్తృత విశ్వగోళ శాస్త్ర రహస్యము. భారతీయ ఆర్ష విద్యలపట్ల గౌరవమున్న ప్రతి మానవుడు పంచాంగాన్ని అభిమానించాలి. ఈ నూతన సంవత్సరంలో ప్రజలందరూ కూడా ఆయురారోగ్యాలతో ఉండాలని , ధరలన్నీ కూడా నియంత్రలో ఉండాలని , ప్రభువుల మధ్య మంచి స్నేహ భావము ఉండాలని , పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని , ఏలాంటి భయంకరమైన యుద్ధాలు జరగకుండా ప్రజలందరూ సంతోషంగా ప్రశాంతముగా ఉండాలని ఈ సందర్భంగా కోరుకుంటున్నామన్నారు. అనంతరం గంట రవికుమార్ మాట్లాడుతూ.. ప్రముఖ జ్యోతిష్య పండితులు డాక్టర్ కాళేశ్వరం సుమన్ శర్మ జ్యోతిష్య శాస్త్రంలో విశేష అనుభవం కలిగిన నిపుణులని, ఆయన జ్యోతిష్య శాస్త్రంలో 'ట్రిపుల్ పిహెచ్‌డి' చేసిన మహా పండితులుగా పేరుగాంచిన మహానుభావుడని, సుమన్ శర్మ జ్యోతిష్యం మాత్రమే కాకుండా వాస్తు, సంఖ్యాశాస్త్రం, వైద్య జ్యోతిష్యం వంటి అనేక విభాగాల్లో దిగ్గజం అని కొనియాడారు. ఈ నూతన సంవత్సరంలో ప్రజలందరూ కూడా ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని, ప్రజలందరూ సంతోషంగా ప్రశాంతముగా ఉండాలని ఓరుగల్లు ఇలవేల్పు శ్రీ భద్రకాళి అమ్మవారిని కోరుకోవడం జరిగిందన్నారు.



# మహిళలు ఆర్థిక స్వయం సమృద్ధి సాధించాలి

**- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ**

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**

మహిళలు ఆర్థిక స్వయం సమృద్ధి సాధించాలని రాష్ట్ర దేవాదాయ,అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) సందర్భం ను పురస్కరించుకొని వరంగల్ (తూర్పు) నియోజక వర్గ పరిధి శివ నగర్ లోని సాయి కన్వెన్షన్ హాల్ లో జిల్లా మైనారిటీ శాఖ ఆధ్వర్యంలో ఇందిరమ్మ మైనారిటీస్ మహిళా శక్తి కార్యక్రమం లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని మైనారిటీ లబ్ధిదారులు 400 మందికి మంత్రి చేతుల మీదుగా కుట్టు మిషన్ లను రంజాన్ పర్వదినం సందర్భంగా బహుమతులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలని రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని మహిళా అంటే సృష్టి అని, దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో మహిళల పోరాట స్ఫూర్తి అనిర్వచనీయం అని మహిళామణులు ఓర్పు,ఓపిక లాంటి వాటికి ప్రత్యామ్నాయంగా సూచించబడతారని,గతంతో పోల్చితే మహిళలు దృఢ సంకల్పంతో ముందుకు వెళుతున్నారని జిల్లాలో మహిళ అధికారులే ముఖ్య భూమిక పోషిస్తూ జిల్లా కలెక్టర్, మేయర్ మున్సిపల్ కమిషనర్ మహిళలుగా ఈ జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు నడిపిస్తున్నారని, పుట్టబోయేది అమ్మాయి అని తెలుసుకొని ఆదిలోనే వారిని నియంత్రిస్తున్నారని ఇలాంటి ఘటన పై కఠినచర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి మగాడి విజయం వెనక ఒక స్త్రీ ఉంటుందని పురుషులతో సమానంగా మహిళలకు అవకాశాలు కలిస్తే మహిళ లు ఆర్థికంగా రాజకీయంగా బలోపేతం అవడమే కాకుండా కుటుంబ వ్యవస్థ సామాజిక వ్యవస్థ పటిష్టంగా తయారవుతుందని, ఎక్కడ స్త్రీ పూజింప బడుతుందో అక్కడ దేవతలు కొలువై ఉంటారని, కుట్టు మిషన్‌ల ద్వారా మహిళలు స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఇట్టి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటారని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పల్లం పద్మ, ముష్కమల్ల అరుణ, గుండు చందన, పోశాల పద్మ, సోమిశెట్టి ప్రవీణ్ కుమార్, జిల్లా మైనారిటీ అధికారి రమేష్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి తదితరులు పాల్గొన్నారు.



వేద న్యూస్

ఆదివారం మార్చి 08, 2026

# 10 రోజుల ముందే టికెట్ల వేట..



**వేద న్యూస్ డెస్క్:**

రణ్‌వీర్ సింగ్ అభిమానులకు మరియు సినీ ప్రియులకు గుడ్ న్యూస్ అందింది. రణ్‌వీర్ సింగ్ నటిస్తున్న భారీ యాక్షన్ స్పై థ్రిల్లర్ 'ధురంధర్ 2: ది రివెంజ్' మార్చి 19న విడుదల కాబోతుండగా.. విడుదల తేదీ కంటే పది రోజుల ముందే ఇండియాలో అడ్వాన్స్ బుకింగ్స్‌ను ప్రారంభించారు మేకర్స్. ఇప్పటికే అమెరికా, ఆస్ట్రేలియా వంటి విదేశీ మార్కెట్లలో బుకింగ్స్ ఓపెన్ అయి రికార్డు స్థాయి వసూళ్లతో దూసుకుపోతున్నాయి. మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమాకు సంబంధించి మార్చి 18వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచే భారీ స్థాయిలో పెయిడ్ ప్రివ్యూలను ప్లాన్ చేశారు. మొదటి భాగం హిందీలో భారీ విజయం సాధించగా, ఈ సీక్వెల్‌ను తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేస్తున్నారు. సుమారు 3 గంటల 40 నిమిషాల సుదీర్ఘ రన్ టైమ్‌తో వస్తున్న ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్‌తో పాటు సంజయ్ దత్, అర్జున్ రాంపాల్, ఆర్. మాధవన్ వంటి హేమాహేమీలు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మొదటి భాగం బాక్సాఫీస్ వద్ద రూ.1400 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన నేపథ్యంలో, రెండో భాగంపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ముఖ్యంగా పోటీగా రావాల్సిన యష్ 'టాక్సిక్' సినిమా జూన్ నెలకు వాయిదా పడటంతో, 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద సోలోగా సరికొత్త రికార్డులు సృష్టించే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# బాలీవుడ్‌లో మరో సినిమాకు సిద్ధమవుతున్న శ్రీలీల

**వేద న్యూస్ డెస్క్:**

దక్షిణ భారత చిత్రసీమలో వరుస విజయాలతో గుర్తింపు పొందిన హీరోయిన్ శ్రీలీల ఇప్పుడు బాలీవుడ్‌లో మరో సినిమాకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. సౌత్ ఇండస్ట్రీలో సక్సెస్ సాధించిన పలువురు హీరోయిన్లు బాలీవుడ్ వైపు అడుగులు వేస్తుండగా, అదే జాబితాలో శ్రీలీల కూడా చేరారు. ఇప్పటికే బాలీవుడ్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నాలు ప్రారంభించిన ఆమె ప్రస్తుతం కొత్త ప్రాజెక్ట్‌తో వార్తల్లో నిలుస్తున్నారు. శ్రీలీల బాలీవుడ్ ప్రయాణం కొన్ని నెలల క్రితమే ప్రారంభమైనప్పటికీ ఆమె తొలి సినిమా ఇప్పటికీ విడుదల కాలేదు. ప్రముఖ నటుడు కార్తీక్ ఆర్యన్ సరసన ఆమె నటించిన సినిమా విడుదల ఆలస్యం కావడంతో ఆమె డెబ్యూ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ సినిమా విడుదల తర్వాతే ఆమెకు బాలీవుడ్‌లో మరింత గుర్తింపు వచ్చే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇక సౌత్ ఇండస్ట్రీలో మాత్రం శ్రీలీల వరుస సినిమాలతో బిజీగా కొనసాగుతున్నారు. తెలుగు చిత్రసీమలో పలువురు ప్రముఖ హీరోలతో కలిసి ఆమె నటించిన సినిమాలు మంచి విజయాలు సాధించాయి. తన నటన, నృత్యంతో ప్రేక్షకులను ఆకట్టుకున్న శ్రీలీలకు యువతలో మంచి అభిమాన వర్గం ఉంది. ఇటీవల మరో ఆసక్తికరమైన బాలీవుడ్ ప్రాజెక్ట్‌కు ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. బాలీవుడ్‌లో కూడా తన ప్రతిభను నిరూపించుకోవాలని శ్రీలీల భావిస్తున్నట్లు తెలుస్తోంది.



# వెంకటేష్‌అనిల్ రావిపూడి కాంబోలో కొత్త సినిమా



**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్‌లో విజయవంతమైన కాంబినేషన్‌లలో ఒకటిగా గుర్తింపు పొందిన నటుడు వెంకటేష్ మరియు దర్శకుడు అనిల్ రావిపూడి జోడీ మరోసారి ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే వీరి కాంబినేషన్‌లో వచ్చిన పలు చిత్రాలు ప్రేక్షకాదరణ పొందడంతో పాటు వాణిజ్యపరంగా కూడా మంచి విజయాన్ని సాధించాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు మరో వినోదాత్మక చిత్రాన్ని తెరకెక్కించేందుకు దర్శకుడు అనిల్ రావిపూడి సన్నాహాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ కొత్త ప్రాజెక్ట్‌కు వెంకటేష్ కూడా సమ్మతి తెలిపినట్లు సమాచారం. ప్రస్తుతం కథా రూపకల్పన మరియు స్క్రిప్ట్ పనుల్లో దర్శకుడు బిజీగా ఉన్నారని సినీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటికే వీరి కాంబినేషన్‌లో వచ్చిన కొన్ని సినిమాలు ప్రేక్షకులను బాగా అలరించాయి. వినోదానికి ప్రధాన ప్రాధాన్యత ఇచ్చే అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేష్ నటన ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుండటంతో ఈ జోడీకి మంచి క్రేజ్ ఏర్పడింది. అదే జోష్‌ను కొనసాగిస్తూ మరోసారి ప్రేక్షకులకు పూర్తి వినోదాన్ని అందించే కథను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో ప్రత్యేక ఆకర్షణగా నటుడు కళ్యాణ్ రామ్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారని ప్రచారం జరుగుతోంది. కథలో కీలక మలుపు తిప్పేలా ఆయన పాత్ర ఉంటుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. వెంకటేష్ మరియు కళ్యాణ్ రామ్ ఒకే సినిమాలో కనిపించనున్నారనే వార్త ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇక ఈ సినిమాలో వెంకటేష్ సరసన హీరోయిన్‌గా కీర్తి సురేష్ నటించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. గతంలో తన ప్రతిభతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కీర్తి సురేష్ ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు అంగీకరించినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే కళ్యాణ్ రామ్‌కు జోడీగా నటించే హీరోయిన్ ఎంపిక ప్రక్రియ ఇంకా కొనసాగుతున్నట్లు సమాచారం. చిత్ర బృందం త్వరలోనే అధికారిక ప్రకటన చేసే అవకాశముందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రానికి సంగీతాన్ని భీమ్స్ సిసిరోలియో అందించనుండగా సినిమాటోగ్రఫీ బ చేపట్టనున్నాయి. ప్రస్తుతం వెంకటేష్ నటిస్తున్న సినిమా పూర్తయ్యిన తర్వాత ఈ కొత్త ప్రాజెక్ట్ చిత్రీకరణ ప్రారంభం కానుంది. జూన్ నెలలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి సంక్రాంతి సీజన్‌ను లక్ష్యంగా పెట్టుకుని సినిమాను విడుదల చేయాలని నిర్మాతలు భావిస్తున్నట్లు సమాచారం. దర్శకుడు అనిల్ రావిపూడి ప్రత్యేకమైన హాస్యశైలి, వెంకటేష్ టైమింగ్ కామెడీ మరియు ఇతర నటీనటుల పాత్రలు కలిసి ఈ చిత్రాన్ని పెద్ద వినోదాత్మక సినిమాగా నిలబెట్టే అవకాశముందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు

# గద్దర్ అవార్డులు ప్రకటింపు

**వేద న్యూస్ డెస్క్ :**

తెలుగు చలనచిత్ర రంగంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన కళాకారులకు ప్రదానం చేసే ప్రతిష్టాత్మక గద్దర్ అవార్డులు2025 విజేతల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం శనివారం అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది అత్యున్నత పురస్కారాల్లో భాగంగా సినీ రంగానికి విశేష సేవలు అందించిన పలువురు ప్రముఖులకు అరుదైన గౌరవం లభించింది. తెలుగు సినీ పరిశ్రమకు నాలుగు దశాబ్దాలుగా తన నటనతో అపారమైన సేవలు అందించిన ప్రముఖ నటుడు చిరంజీవికి ప్రతిష్టాత్మక ఎన్టీఆర్ జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. అలాగే భారతీయ చలనచిత్ర రంగంలో తన విలక్షణ నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ప్రముఖ నటుడు కమల్ హాసన్‌కు పైడి జయరాజ్ అవార్డును ప్రకటించారు. ఈ అవార్డుల వివరాలను ప్రముఖ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ వెల్లడిస్తూ, 2025 జనవరి 1 నుండి డిసెంబర్ 31 వరకు సెన్సార్ పూర్తిచేసుకున్న చిత్రాలు మరియు చిన్న చిత్రాల నుంచి విజేతలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక జాబితాలో ప్రముఖ నటి జయసుధకు ఏఎన్నార్ పురస్కారం, ప్రముఖ నిర్మాత అశ్విని దత్‌కు నాగిరెడ్డిచక్రపాణి అవార్డు, ప్రముఖ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజకు సినారే అవార్డు ప్రకటించబడ్డాయి. తెలుగు చలనచిత్ర రంగానికి వారు అందించిన విశిష్ట సేవలను గుర్తించి ఈ అవార్డులు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక గద్దర్ అవార్డులను ఈ నెల 19వ తేదీన ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో నిర్వహించనున్న ఘన కార్యక్రమంలో ప్రదానం చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి సినీ, సాంస్కృతిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరుకానుండగా అవార్డు గ్రహీతలను ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. తెలుగు సినీ రంగంలో ప్రతిభను ప్రోత్సహించడంలో ఈ అవార్డులు కీలక పాత్ర పోషిస్తాయని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.తెలుగు చలనచిత్ర రంగంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన కళాకారులకు ప్రదానం చేసే ప్రతిష్టాత్మక గద్దర్ అవార్డులు2025 విజేతల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం శనివారం అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది అత్యున్నత పురస్కారాల్లో భాగంగా సినీ రంగానికి విశేష సేవలు అందించిన పలువురు ప్రముఖులకు అరుదైన గౌరవం లభించింది. తెలుగు సినీ పరిశ్రమకు నాలుగు దశాబ్దాలుగా తన నటనతో అపారమైన సేవలు అందించిన ప్రముఖ నటుడు చిరంజీవికి ప్రతిష్టాత్మక ఎన్టీఆర్ జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ అవార్డుల వివరాలను ప్రముఖ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ వెల్లడిస్తూ, 2025 జనవరి 1 నుండి డిసెంబర్ 31 వరకు సెన్సార్ పూర్తిచేసుకున్న చిత్రాలు మరియు చిన్న చిత్రాల నుంచి విజేతలను ఎంపిక చేసినట్లు తెలిపారు.ఏఎన్నార్ పురస్కారం, ప్రముఖ నిర్మాత అశ్విని దత్‌కు నాగిరెడ్డిచక్రపాణి అవార్డు, ప్రముఖ ప్రకటించబడ్డాయి.ఎన్టీఆర్ జాతీయ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. అలాగే భారతీయ చలనచిత్ర రంగంలో తన విలక్షణ నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ప్రముఖ నటుడు కమల్ హాసన్‌కు పైడి జయరాజ్ అవార్డును ప్రకటించారు.





# పక్కా ప్రణాళిక ఉంటే ఏదైనా సాధ్యమే: కరీనా కపూర్

**వేద న్యూస్ డెస్క్:**

తల్లైన తర్వాత జీవితంలో ప్రాధాన్యతలు మారడం సహజమేనని ప్రముఖ నటి కరీనా కపూర్ అన్నారు. అయితే సరైన ప్రణాళికతో కుటుంబ బాధ్యతలు మరియు వృత్తి జీవితాన్ని సమతుల్యంగా కొనసాగించడం సాధ్యమేనని ఆమె అభిప్రాయపడ్డారు. బాలీవుడ్‌లో ప్రముఖ నటీమణులు దీపికా పదుకొణె, కరీనా కపూర్ తల్లైన తర్వాత తమ కెరీర్‌ను ఎలా నిర్వహించాలి అనే అంశంపై వ్యక్తపరిచిన అభిప్రాయాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారితీస్తున్నాయి. పని గంటలను పరిమితం చేయాలని దీపికా సూచిస్తే, ముందస్తు ప్రణాళికతో అన్నీ సాధ్యమని కరీనా చెప్పడం సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. తల్లైన తర్వాత తన ప్రాధాన్యతలు మారాయని దీపికా ఇటీవల పేర్కొంటూ రోజుకు ఎనిమిది గంటలకే పని పరిమితం చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. కొత్తగా తల్లయిన మహిళలకు చిత్రసీమ మరియు కుటుంబం మద్దతుగా నిలవాలని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ నిర్ణయం కారణంగా కొన్ని భారీ చిత్రాల అవకాశాలను వదులుకోవాల్సి వచ్చిందన్న వార్తలు కూడా వినిపిస్తున్నాయి. దీనిపై సామాజిక మాధ్యమాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఆమె నిర్ణయాన్ని సమర్థిస్తుండగా, మరికొందరు చిత్ర నిర్మాణంలో ఇది ఎల్లప్పుడూ సాధ్యం కాదని వ్యాఖ్యానిస్తున్నారు. ఇదిలా ఉండగా కరీనా కపూర్ స్పందిస్తూ, సరైన ప్రణాళికతో కుటుంబ బాధ్యతలు మరియు పనిని సమన్వయం చేసుకోవచ్చని చెప్పారు. ఒక చిత్రీకరణ కోసం విదేశాల్లో సుమారు ముప్పై ఐదు రోజులు ఉండాల్సి వచ్చిన సందర్భంలో ముందుగానే ప్రణాళిక రూపొందించుకుని పిల్లల బాధ్యతను నిర్వహించగలిగానని తెలిపారు. తాను పనిలో ఉండగా తన భర్త సైఫ్ అలీ ఖాన్ ఇంట్లో పిల్లలను చూసుకున్నారని, ఇద్దరూ ఒకేసారి పని కోసం బయటకు వెళ్లకూడదనే నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. చిత్రీకరణ మధ్యలో విరామం తీసుకుని స్వదేశానికి వచ్చి పిల్లలతో సమయం గడిపేలా చిత్ర బృందం సహకరించిందని చెప్పారు. అన్నీ ముందుగానే ప్రణాళిక చేసుకుంటే కుటుంబం మరియు వృత్తి మధ్య సమతుల్యత సాధ్యమవుతుందని కరీనా అభిప్రాయపడ్డారు.



వేద న్యూస్

ఆదివారం మార్చి 08, 2026

# ఫైనల్‌కు బ్యాటింగ్‌కు అనుకూల పిచ్

**వేద న్యూస్ డెస్క్:**



టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్ పోరుకు రంగం సిద్ధమైంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో భారత్, న్యూజిలాండ్ జట్ల మధ్య జరగనున్న తుది పోరుకు బ్యాటర్లకు అనుకూలించే పిచ్‌ను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. గత టోర్నీల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి భారత జట్టు యాజమాన్యం పిచ్ ఎంపిక విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. మ్యాచ్ ఆసక్తికరంగా సాగేందుకు బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే విధంగా పిచ్‌ను రూపకల్పన చేస్తున్నట్లు క్రీడా వర్గాలు చెబుతున్నాయి. ఫైనల్ మ్యాచ్ కోసం ఎర్రమట్టి, నల్లమట్టి మిశ్రమంతో కూడిన ప్రత్యేక పిచ్‌ను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఇందులో ఎర్రమట్టిని ఎక్కువగా ఉపయోగించినట్లు తెలుస్తోంది. ఎర్రమట్టి ఉండటం వల్ల పిచ్‌పై బంతికి మంచి బౌన్స్ లభించే అవకాశం ఉంటుంది. దీంతో బ్యాటర్లు షాట్లు ఆడేందుకు మరింత అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. రెండు జట్లు కూడా దూకుడుగా బ్యాటింగ్ చేసే అవకాశం ఉండటంతో మ్యాచ్‌లో భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. స్పిన్నర్లకు ఈ పిచ్ పెద్దగా సహకరించకపోవచ్చని క్రీడా నిపుణులు చెబుతున్నారు. బౌన్స్ ఎక్కువగా ఉండటంతో ఫాస్ట్ బౌలర్లకు కొంతవరకు సహాయం లభించే అవకాశం ఉన్నప్పటికీ, ప్రధానంగా బ్యాటర్లకు అనుకూల పరిస్థితులు ఉండే అవకాశం ఉందని అంటున్నారు. ఈ నేపథ్యంలో మ్యాచ్‌లో 200 పరుగుల స్కోరు కూడా సాధారణంగా మారే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

ఈ వ్యూహాత్మక నిర్ణయం వెనుక గత అనుభవాలు కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌లో ఆస్ట్రేలియా చేతిలో భారత్ ఓటమికి నెమ్మదిగా ఉన్న నల్లమట్టి పిచ్ ఒక కారణంగా నిలిచినట్లు విశ్లేషణలు వచ్చాయి. అంతేకాకుండా ప్రస్తుత టోర్నీలో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో కూడా పిచ్ స్వభావం టీమిండియాపై ప్రభావం చూపింది. ఈ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి ముందుగానే వ్యూహాత్మకంగా నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. భారత జట్టు యాజమాన్యం స్థానిక క్యూరేటర్లతో చర్చించి ఫైనల్ మ్యాచ్‌కు అనుకూలంగా ఉండే విధంగా పిచ్‌ను సిద్ధం చేయాలని సూచించినట్లు సమాచారం. లీగ్ దశలో కొన్ని పిచ్‌ల తీరుపై జట్టు యాజమాన్యం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు కూడా క్రీడా వర్గాలు పేర్కొంటున్నాయి. అందుకే ఈసారి ఎలాంటి సందేహాలు లేకుండా ముందుగానే పిచ్ రూపకల్పనపై స్పష్టత తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. క్రీడా వర్గాల అభిప్రాయం ప్రకారం ఈ పిచ్ దూకుడైన బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే అవకాశం ఉంది. ముఖ్యంగా మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు మ్యాచ్‌లో కీలక పాత్ర పోషించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ టోర్నీలో ఇదే మైదానంలో జరిగిన ఒక మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా జట్టు 213 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ నేపథ్యంలో ఫైనల్ మ్యాచ్‌లో కూడా పరుగుల వరద పారే అవకాశం ఉందని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# అభిషేక్‌కే మరో అవకాశం




**వేద న్యూస్ డెస్క్:**

టీ20 ప్రపంచకప్ ఫైనల్‌కు ముందు భారత జట్టులో ఒక కీలక అంశం చర్చకు దారితీస్తోంది. యువ ఓపెనర్ అభిషేక్ శర్మ వరుసగా తక్కువ స్కోర్లతో నిరాశపరిచినప్పటికీ, తుదిపోరులో కూడా అతడికే అవకాశం ఇవ్వాలని జట్టు యాజమాన్యం భావిస్తున్నట్లు సమాచారం. ఆదివారం అహ్మదాబాద్‌లో న్యూజిలాండ్‌తో జరిగే ఫైనల్ మ్యాచ్‌లో విన్నింగ్ కాంబినేషన్‌ను మార్చకూడదనే ఆలోచనతో టీమ్ మేనేజ్‌మెంట్ ఈ నిర్ణయానికి మొగ్గు చూపుతున్నట్లు క్రీడా వర్గాలు చెబుతున్నాయి. ఈ టోర్నీ ప్రారంభంలో అభిషేక్ శర్మ జట్టుకు కీలక ఆటగాడిగా నిలుస్తాడని అంచనాలు ఉన్నాయి. అయితే టోర్నీ కీలక దశకు చేరుకునే సరికి అతడి ఫామ్ పడిపోయింది. గత ఆరు మ్యాచుల్లో అతడు 0, 0, 0, 15, 10, 9 పరుగులు మాత్రమే చేసి నిరాశపరిచాడు. జింబాబ్వేపై చేసిన అర్ధశతకం మినహా ఈ టోర్నీలో అతడి నుంచి పెద్ద ఇన్నింగ్స్ రాలేదు. దీంతో ఓపెనింగ్ విభాగంపై కొంత ఆందోళన వ్యక్తమవుతోంది. అభిషేక్ ఫామ్ తగ్గడానికి ఆరోగ్య సమస్యలు కూడా ఒక కారణంగా భావిస్తున్నారు. లీగ్ దశ తర్వాత అతడు కడుపు ఇన్ఫెక్షన్‌తో ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు సమాచారం. ఆ సమయంలో బరువు కూడా తగ్గిపోవడంతో అతడి ఆటపై ప్రభావం పడినట్లు క్రీడా విశ్లేషకులు చెబుతున్నారు. అదే సమయంలో ప్రత్యర్థి జట్లు అతడి బలహీనతలను గుర్తించి ప్రత్యేక వ్యూహాలతో బౌలింగ్ చేస్తున్నాయి. ముఖ్యంగా స్పిన్ బౌలింగ్‌తో అతడిని కట్టడి చేయడానికి ప్రయత్నిస్తున్నాయి. పవర్‌ప్లేలో వేగం ఉన్న బౌలింగ్‌ను ఎదుర్కోవడంలో అభిషేక్ శర్మ దూకుడుగా ఆడగలడని తెలిసినా, స్పిన్నర్ల బంతులను ఎదుర్కోవడంలో అతడు ఇబ్బంది పడుతున్నట్లు కనిపిస్తోంది. ఆఫ్ స్పిన్నర్లు మరియు స్లో లెఫ్ట్ ఆర్మ్ బౌలర్లతో అతడిని పరుగులు చేయకుండా నిరోధిస్తున్నాయి. పేస్ లేని బంతులను ఎదుర్కొనే సమయంలో షాట్లు ఆడేందుకు తొందరపడటం వల్ల వికెట్లు కోల్పోతున్నట్లు విశ్లేషణలు చెబుతున్నాయి.

అతడి స్థానంలో రింకూ సింగ్‌ను జట్టులోకి తీసుకునే అవకాశం ఉన్నప్పటికీ, అలా చేస్తే జట్టు సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉందని యాజమాన్యం భావిస్తున్నట్లు సమాచారం. రింకూను తీసుకుంటే అతడు దిగువ క్రమంలో బ్యాటింగ్ చేయాల్సి వస్తుంది. అందువల్ల ఓపెనింగ్ కాంబినేషన్‌ను మార్చకుండా అభిషేక్ శర్మపైనే నమ్మకం ఉంచాలని టీమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

# ఆస్ట్రేలియా ఆలౌట్



**వేద న్యూస్ డెస్క్:**

భారత మహిళల జట్టుతో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో ఆస్ట్రేలియా మహిళల జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 323 పరుగులకు ఆలౌటైంది. దీంతో టీమిండియాపై 125 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. అన్నాబెల్ సదర్లాండ్ 129 పరుగులతో శతకం సాధించి జట్టును ఆదుకుంది. ఎలీస్ పెర్రీ 76 పరుగులతో హాఫ్ సెంచరీ నమోదు చేసింది. భారత బౌలర్ సయాలీ సత్ఘరే అరంగేట్రంలోనే అద్భుత ప్రదర్శన కనబరిచింది. నాలుగు వికెట్లు తీసి ఆస్ట్రేలియా జట్టును కాస్త కట్టడి చేసింది. క్రాంతి గౌడ్, దీప్తి శర్మ తలో రెండు వికెట్లు పడగొట్టగా, స్నేహ్ రాణా, షెఫాలీ వర్మ తలో వికెట్ సాధించారు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 198 పరుగులకు ఆలౌటైన విషయం తెలిసిందే. ఆస్ట్రేలియా బ్యాటర్లలో సదర్లాండ్, పెర్రీ మినహా మిగతా ఆటగాళ్లు పెద్దగా రాణించలేకపోయారు. జార్జియా వాల్ 2, ఫోబ్ లిచ్‌ఫీల్డ్ 9, అలీసా హీలీ 13, బెత్ మూనీ 19, ఆష్లీ గార్డ్‌నర్ 1, మెక్ గ్రాత్ 13, అలానా కింగ్ 21, లూసీ హామిల్టన్ 23 పరుగులు చేసి ఔటయ్యారు.

## ఈనెల 25 నుంచి ఖేలో ఇండియా ట్రైబల్ గేమ్స్



**వేద న్యూస్ డెస్క్:**

గిరిజన క్రీడాకారుల్లోని ప్రతిభను ప్రోత్సహించి వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో కేంద్ర క్రీడాశాఖ ఖేలో ఇండియా ట్రైబల్ గేమ్స్ నిర్వహణకు సిద్ధమైంది. ఈ మెగా క్రీడా వేడుక ఈ నెల 25న ప్రారంభమై ఏప్రిల్ 6 వరకు కొనసాగనుంది. కేంద్ర క్రీడా శాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, భారత ఒలింపిక్ సంఘం మరియు వివిధ జాతీయ క్రీడా సమాఖ్యలు సంయుక్తంగా ఈ పోటీలను నిర్వహించనున్నాయి. దేశంలోని గిరిజన ప్రాంతాల నుంచి యువ క్రీడాకారులు పెద్ద సంఖ్యలో ఈ పోటీల్లో పాల్గొననున్నారు. ఈ ఏడాది ఈ క్రీడలకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఆతిథ్యం ఇస్తోంది. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రసిద్ధి చెందిన ఈ రాష్ట్రంలో రాయ్‌పూర్, జగ్‌దల్‌పూర్, సర్గుజా ప్రాంతాల్లోని వివిధ క్రీడా మైదానాల్లో పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ పర్యవేక్షణలో ఈ క్రీడలు జరుగనున్నాయి. దేశవ్యాప్తంగా ఉన్న గిరిజన యువ క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించుకునే వేదికగా ఈ కార్యక్రమం నిలుస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు. ఈ పోటీల్లో మొత్తం ఏడు మెడల్ క్రీడలను నిర్వహించనున్నారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, హాకీ, వెయిట్‌లిఫ్టింగ్, ఆర్చరీ, స్విమ్మింగ్, రెజ్లింగ్ వంటి క్రీడలతో పాటు సంప్రదాయ క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇచ్చారు. మల్లఖంభ్ వంటి భారతీయ సంప్రదాయ క్రీడను కూడా ఈ పోటీల్లో చేర్చారు. అదేవిధంగా కబడ్డీ పోటీలు కూడా నిర్వహించనున్నారు. ఈ క్రీడలు గిరిజన యువతలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు సహాయపడతాయని నిర్వాహకులు భావిస్తున్నారు.

## న్యూజిలాండ్‌నే అసలైన చోకర్స్: స్టెయిన్






**వేద న్యూస్ డెస్క్:**

ప్రపంచకప్ వంటి టోర్నీల్లో నాకౌట్ దశలోనే ఇంటిదారి పట్టే దక్షిణాఫ్రికా జట్టును 'చోకర్స్' అని పిలవడం సాధారణంగా మారింది. అయితే మాజీ పేసర్ డేల్ స్టెయిన్ మాత్రం తమ జట్టును చోకర్స్‌గా పిలవడాన్ని ఖండించాడు. అసలైన చోకర్స్ న్యూజిలాండ్ జట్టేనని సంచలన వ్యాఖ్యలు చేశాడు. పొట్టి ప్రపంచకప్ సెమీఫైనల్లో అనూహ్యంగా తడబడి దక్షిణాఫ్రికా మరోసారి విమర్శలు ఎదుర్కొంది. ఐసీసీ టోర్నీల్లో లీగ్ దశలో అద్భుతంగా ఆడినా, నాకౌట్ మ్యాచ్‌ల్లో మాత్రం ఆశించిన ఫలితాలు సాధించలేకపోవడం ఆ జట్టుకు అలవాటుగా మారిందని అభిమానులు అంటున్నారు. రెండేళ్ల క్రితం టీ20 ప్రపంచకప్ ఫైనల్లో గెలిచే మ్యాచ్‌ను కూడా ప్రొటీస్ జట్టు చేజార్చుకుంది. ఈసారి కూడా లీగ్ దశ నుంచి సూపర్ 8 వరకూ అజేయంగా నిలిచినా, సెమీఫైనల్లో న్యూజిలాండ్ చేతిలో ఓటమి చవిచూసింది. ఈ నేపథ్యంలో స్టెయిన్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ దక్షిణాఫ్రికాను చోకర్స్ అంటున్నారని, కానీ న్యూజిలాండ్ కూడా ఎక్కువ వరల్డ్‌కప్ ట్రోఫీలు గెలవలేదని పేర్కొన్నారు. కివీస్ జట్టు తమ జట్టుకంటే ఎక్కువసార్లు ఫైనల్స్ ఆడినా, ట్రోఫీలు మాత్రం చాలా తక్కువగా గెలిచిందని తెలిపారు. ఇప్పటివరకు న్యూజిలాండ్ జట్టు ఎనిమిదిసార్లు ఐసీసీ ఫైనల్స్ ఆడింది. అయితే కేవలం రెండుసార్లు మాత్రమే విజేతగా నిలిచింది. 2000లో ఐసీసీ నాకౌట్ ట్రోఫీ గెలిచిన కివీస్, 2021లో కేన్ విలియమ్సన్ సారథ్యంలో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ఆ తర్వాత మాత్రం కీలక ఫైనల్స్‌లో ఓటములను ఎదుర్కొంటూ వస్తోంది. ఈ నేపథ్యంలో ఆదివారం జరిగే ఫైనల్లో భారత్ చేతిలో న్యూజిలాండ్ ఓడితే, అసలైన చోకర్స్ అనే ట్యాగ్ వారికి సరిపోతుందని స్టెయిన్ వ్యాఖ్యానించాడు.

## టీమిండియాలోని ప్రతి ప్లేయర్‌తో ప్రమాదమే

**వేద న్యూస్ డెస్క్:**

టీమిండియాతో పోటీ పడటం సులభం కాదని న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ వ్యాఖ్యానించారు. భారత జట్టులో కేవలం జస్ప్రీత్ బుమ్రా మాత్రమే కాదు, ప్రతి ప్లేయర్ మ్యాచ్‌ను మలుపు తిప్పగల సామర్థ్యం కలిగి ఉన్నాడని ఆయన అన్నారు. అందువల్ల ఇండియా జట్టును ఎదుర్కొనే సమయంలో చాలా జాగ్రత్తగా ఆడాల్సి ఉంటుందని తెలిపారు. మీడియాతో మాట్లాడిన శాంట్నర్, బుమ్రా గురించి ప్రత్యేకంగా ప్రశంసలు కురిపించారు. ఆయన వరల్డ్ క్లాస్ బౌలర్ మాత్రమే కాకుండా మ్యాచ్ ఫలితాన్ని మార్చగల గేమ్ చేంజర్ అని పేర్కొన్నారు. కీలక సమయాల్లో వికెట్లు తీసే సామర్థ్యం బుమ్రాకు ఉందని అన్నారు. అహ్మదాబాద్‌లో జరగనున్న మ్యాచ్‌కు సంబంధించిన పిచ్‌ను ఇంకా చూడలేదని శాంట్నర్ తెలిపారు. అయితే ఆ పిచ్‌పై మ్యాచ్ హై స్కోరింగ్‌గా ఉండే అవకాశం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇండియా టీమ్‌లో ప్రతి ప్లేయర్ కీలక సమయంలో మ్యాచ్‌ను టర్న్ చేసే సామర్థ్యం కలిగి ఉన్నాడని ఆయన మరోసారి స్పష్టం చేశారు.






Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073